



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 273 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 9 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 273 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 9 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## విజయవాడలో 'సెలూన్ కొనికి'
# ప్రారంభోత్సవం...
## షార్ట్స్ తో వచ్చిన పవన్ కల్యాణ్..

- విజయవాడలో 'కొనికి' పేరుతో నూతన సెలూన్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- పాల్గొన్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- సెలూన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు
- ట్రెండీ దుస్తుల్లో ఆకట్టుకున్న పవన్ కల్యాణ్
- కార్యక్రమ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్న యార్లగడ్డ




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం విజయవాడలో సందడి చేశారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన "కొనికి" అనే సెలూన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, యార్లగడ్డ వెంకట్రావు ఇరువురూ సెలూన్ నిర్వాహకులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపారం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ లేత నీలం రంగు రౌండ్ నెక్ టీషర్ట్, నలుపు రంగు షార్ట్స్ ధరించి వచ్చారు. ఆయన క్యాజువల్ లుక్ అందరినీ ఆకట్టుకుంది, ట్రెండీగా కనిపించిందని

వివరాలు 2లో..

# దత్తాత్రేయది ఆదర్శ రాజకీయ జీవితం

## బండారు దత్తాత్రేయ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణకు హాజరైన సీఎం చంద్రబాబు...



- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' ఆవిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- దత్తాత్రేయ నిబద్ధత, సేవా దృక్పథాన్ని కొనియాడిన సీఎం చంద్రబాబు
- యువతకు దత్తాత్రేయ జీవితం స్ఫూర్తిదాయకమని వెల్లడి
- సామాన్యుడిగా మొదలై ఉన్నత శిఖరాలకు చేరిన ప్రస్థానమే ఈ పుస్తకం అన్న దత్తాత్రేయ

పెన్ పవర్ డెస్క్:హర్యానా గవర్నర్, సీనియర్ రాజకీయవేత్త బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమం నేడు హైదరాబాదులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. దశాబ్దాల ప్రజాజీవితంలో దత్తాత్రేయ సాధించిన విజయాలు, ఆయన వ్యక్తిగత మైలురాళ్లు, సామాజిక సేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ఈ పుస్తకం కళ్లకు కడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నేతలు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ మంత్రులు కూడా చంద్రబాబుతో ఉత్సాహంగా మాట్లాడుతూ కనిపించారు. బండారు దత్తాత్రేయ ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' తెలుగు ప్రతిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, దత్తాత్రేయ నిబద్ధత, నిరాడంబరత, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ పుస్తకం భావి తరాల నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన జీవితంలోని ఒడిదొడుకులు, విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. సీనియర్ ప్రజా సేవకుల జీవితానుభవాలను గ్రంథస్థం

వివరాలు 2లో..

## 2026లో తమిళనాడులో డీఎంకే పాలన క్లోజ్..
## NDA కూటమిదే పవర్



పెన్ పవర్ డెస్క్: తమిళనాడు, వెస్ట్ బెంగాల్ ప్రభుత్వాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం (జూన్ 8) మధురైలో బీజేపీ ఆఫీస్ బేరర్లను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ.. 2026లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. 2026 నాటికి బెంగాల్ మమతా బెనర్జీ పాలన, తమిళనాడులో డీఎంకే పాలన ముగుస్తోందని జోస్యం చెప్పారు. తమిళనాడులో అధికార డీఎంకె ప్రభుత్వాన్ని

వివరాలు 2లో..

## మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన అల్లర్లు..
## ఐదు జిల్లాల్లో ఇంటర్ నెట్ సేవల బంద్



పెన్ పవర్ డెస్క్: గతేడాది జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్‌లో మళ్లీ అల్లర్లు చెలరేగాయి. మైతేయి నేత అరంబాయి టెంగోల్ అరెస్టుతో తాజాగా మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. అరంబాయి టెంగోల్‌ను విడుదల చేయాలంటూ ఆ వర్గం ప్రజలు శనివారం (జూన్ 7) రాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగారు. పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చిన నిరసనకారులు టైర్లు, ఫర్నిచర్, పలు వాహనాలను తగలబెట్టారు. తులిహాల్‌లోని ఇంఫాల్ ఎయిర్ పోర్ట్ ప్రవేశ ద్వారం వద్ద ఆందోళన చేశారు.

తమ నాయకుడిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భద్రతా దళాలతో ఘర్షణకు దిగారు. రాష్ట్ర రాజధాని ఇంఫాల్?లో కొందరు ఆందోళనకారులు పెట్రోల్ మీద పోసుకుని ఆత్మాహుతికి ప్రయత్నించారు. శనివారం రాత్రి మొదలైన ఆందోళనలు ఆదివారం కూడా కొనసాగాయి.

వివరాలు 2లో..

## బలూచిస్థాన్ లో పాక్ కొత్త చట్టం...
# సైన్యానికి మరింత పవర్!

- బలోచిస్థాన్‌లో వివాదాస్పద ఉగ్రవాద వ్యతిరేక సవరణ చట్టం 2025 ఆమోదం
- ఆరోపణలు లేకున్నా 90 రోజుల నిర్బంధానికి సైన్యానికి, నిఘా సంస్థలకు అధికారం
- ముందస్తు అనుమతులు లేకుండానే సోదాలు, అరెస్టులకు వీలు
- పౌర హక్కుల ఉల్లంఘనేనంటూ అంతర్జాతీయ సంస్థల తీవ్ర ఆందోళన
- ఈ చట్టం బలూచ్ పౌరులే లక్ష్యంగా తెచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి
- గతంలో రహస్యంగా జరిగిన చర్యలకు ఇప్పుడు చట్టబద్ధత కల్పించారని ఆరోపణ



వివరాలు 2లో..

## టాలీవుడ్ లో అనూహ్య పరిణామం...
## ఎన్నికైన ఒక్కరోజుకే సునీల్ నారంగ్ రాజీనామా

- టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా
- ఎన్నికైన 24 గంటల్లోనే పదవి నుంచి తప్పుకోవడంపై చర్చ
- కొందరు తనను సంప్రదించకుండా ప్రకటనలు ఇస్తున్నారని ఆరోపణ
- అలాంటి ప్రకటనలకు తాను బాధ్యుడిని కానని స్పష్టం
- శనివారం మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన సునీల్ నారంగ్

పెన్ పవర్ డెస్క్:తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి (తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ – టీఎఫ్‌సీసీ) అధ్యక్ష పదవికి ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్ అనూహ్యంగా రాజీనామా చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికై, బాధ్యతలు స్వీకరించిన 24 గంటలు కూడా గడవకముందే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో

వివరాలు 2లో..



## కాకాణిని నెల్లూరు జైలుకు తరలించిన పోలీసులు

- అక్రమ మైనింగ్ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీస్ కస్టడీ పూర్తి
- మూడు రోజుల పాటు కృష్ణపట్నం పోర్టు పోలీసుల విచారణ
- ముత్తుకూరులో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు
- న్యాయమూర్తి ఆదేశాలతో కాకాణికి జ్యుడీషియల్ రిమాండ్
- నెల్లూరు జిల్లా జైలుకు తరలించిన పోలీసులు
- సోమవారం హైకోర్టులో కాకాణి బెయిల్ పిటిషన్‌పై విచారణ

వివరాలు 2లో..



## తెలుగు రాష్ట్రాల్లో విషాదం... 9 మంది జలసమాధి

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం తొమ్మిది మంది యువకులు మృతి
- తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీలో ఆరుగురు యువకులు నీట మునిగి మరణం
- ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లాలో సరస్సులో మునిగి ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

వివరాలు 2లో..



## మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఏపీ మంత్రి నారా లోకేశ్



- మాగంటి గోపీనాథ్ గుండెపోటుతో మృతి
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నారా లోకేశ్, బ్రాహ్మణి
- మాదాపూర్ లోని గోపీనాథ్ నివాసానికి వెళ్లి నివాళి అర్పించిన లోకేశ్, బ్రాహ్మణి
- గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన వైనం

పెన్ పవర్ డెస్క్:జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల

వివరాలు 2లో..

## "వేశ్యలు" అంటూ చేసిన ఈ వ్యాఖ్యలను
# ఉపేక్షించే పరిస్థితే లేదు

- రాజధాని మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్ట్ కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు
- జర్నలిస్ట్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, ఖండన
- స్త్రీ జాతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎం
- మాజీ సీఎం జగన్ తీరుపై చంద్రబాబు అసంతృప్తి, విచారం
- మహిళల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు' అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

"తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ



దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

## మేలుకోకుంటే అంతే సంగతులు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు నాలుగేళ్లకు ముందే అలెర్ట్ అయినట్లు కనిపిస్తుంది. ఎమ్మెల్యేల పనితీరును గమనించకపోతే అసలుకే ఎసరు వస్తుందని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కూటమి హవాలో 164 స్థానాల్లో సూపర్ డూపర్ విక్టరీ సాధించినప్పటికీ గత ఏడాదిగా కూటమి పార్టీల నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో, కిందిస్థాయిలో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో పాటు విభేదాలు మరింతగా ముదిరి వీధిన పడుతుండటంతో మూడు పార్టీలకు తలనొప్పిగా తయారయింది. అన్ని చోట్ల ఆధిపత్య పోరు కనిపిస్తుంది. ఇక ఎమ్మెల్యేల పనితీరు కూడా అంత ఆశాజనకంగా లేదని అందుతున్న నివేదికలను బట్టి తెలుస్తోంది.

**సమస్య అంతా...**

ప్రధానంగా ఈసారి ఎన్నికల్లో అత్యధికంగా 88 మంది వరకూ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలతోనే సమస్య తలెత్తుతోంది. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల ఈ సమస్య పెద్దగా కనిపించడం లేదు. వారిపై పెద్దగా ఆరోపణలు కూడా రావడం లేదు. ఎందుకంటే వారి అనుభవంతో అనేక విషయాలను బయటకు రాకుండానే సహజంగా జాగ్రత్త పడుతున్నారు. కానీ కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు మాత్రం నేరుగా రంగంలోకి దిగి బ్యాడ్ నేమ్ ను కొని తెచ్చుకుంటున్నారు. ఇసుక తరలింపు, మద్యం షాపుల వేలంపాటలు, బార్లను కొనసాగించడం, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో తలదూర్చడం వంటి విషయాల్లో కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేల పేర్లు జనం నోళ్లతో నానుతున్నాయి.

**ఎమ్మెల్యేల పనితీరుపై...**

ఒకవైపు సంక్షేమ పథకాలు అందలేదని జనంలో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో మరొకవైపు అవినీతిని ఎమ్మెల్యేలే దగ్గరుండి ప్రోత్సహిస్తుండటం కూడా ప్రజల్లో పలచనకు కారణమయింది. ఇలాగే ఉపేక్షిస్తే వచ్చే ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు చూడాల్సి వస్తుందని చంద్రబాబు తన అనుభవంతో ముందే గుర్తించారు. తాము పరిపాలనలో ఎన్ని సంస్కరణలు, ఎన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు సక్రమంగా లేకపోతే అసలుకే మోసం వస్తుందని భావించిన చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల ముందే అప్రమత్తమయ్యారు. అందుకే ఎమ్మెల్యేలను గాడిలో పెట్టేందుకు తన వంతుగా ఆయన ప్రయత్నాలను ప్రారంబిస్తున్నట్లు కనపడుతుంది.

**గట్టిగా వార్నింగ్ ఇచ్చినప్పటికీ...**

ఇందులో భాగంగానే చంద్రబాబు నాయుడు మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు , కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి.. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది తన ఆలోచన అని నేరుగా చెప్పేశారు. ప్రజలు అన్నీ గమనిస్తారని, జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఇబ్బందులు పడతారని చంద్రబాబు గట్టిగానే హెచ్చరించినట్లు తెలిసింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు, నివేదికలు తెప్పించుకునేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. అంతేకాదు తాను మంచి చేస్తే అభినందిస్తానని, తప్పు చేస్తే దూరం పెడతానని కూడా చెప్పారు. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహించేందుకు కూడా చంద్రబాబు సిద్ధమవుతుండటం చూస్తుంటే కూటమికి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని చంద్రబాబుకు కూడా అర్థమయినట్లే కనిపిస్తుంది.

## మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన అల్లర్లు.. ఐదు జిల్లాల్లో ఇంటర్ నెట్ సేవల బంద్

- మొదటి పేజి తరువాయి

దీంతో కేంద్ర సాయుధ బలగాలు వెంటనే అప్రమత్తమ య్యాయి. ఆందోళనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించాయి. కొన్నిచోట్ల బలగాల లాఠీ ఛార్జ్ చేశాయి. ఉద్రిక్తతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించారు. మణిపూర్ రాజ్ భవన్‌కు వెళ్లే రోడ్ల వెంట భద్రతను పెంచారు. నిరసనలు ఉధృతంగా ఉన్న బిష్ణుపూర్ జిల్లాలో కర్ఫ్యూ విధించారు. ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, తౌబాల్, కాక్చింగ్ లోయ జిల్లాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడకుండా నిషేధాజ్ఞలు విధించారు. ఈ జిల్లాలో ఆన్‌లైన్‌లో హింసను ప్రేరేపించే చర్యలు గుర్తించిన పోలీసులు ఐదు రోజుల పాటు ఇంటర్ నెట్ సేవలు నిలిపివేశారు. కాగా, 2023 నుంచి మణిపూర్?లోని కుకీ, మైతేయి వర్గాల మధ్య జాతి హింస చెలరేగుతోన్న విషయం తెలిసిందే. ఇరువర్గాల మధ్య చెలరేగిన అల్లర్లు తీవ్ర హింసాత్మకంగా మారడంతో అప్పటి నుంచి మణిపూర్?లో భద్రతా దళాలను మోహరించారు. ఇదిలా ఉంటే.. ఆదివారం (జూన్ 8) ఇంఫాల్ విమానాశ్రయంలో మైతేయి నేత అరంబై టెంగోల్?ని సీబీఐ అరెస్టు చేసింది. అతడు 2023లో మణిపూర్ హింసకు సంబంధించిన వివిధ నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడు. దీంతో నిందితుడిని ఇంఫాల్ నుంచి మణిపూర్ హింస కేసులు విచారణలో ఉన్న గౌహతికి తరలించి న్యాయస్థానంలో హాజరు పర్చారు. ఈ క్రమంలోనే అరంబై టెంగోల్?ని విడుదల చేయాలని, అతడిని ఇతర ప్రాంతానికి తరలించవద్దని మైతేయి వర్గం నేతలు ఆందోళనకు దిగడంతో మణిపూర్?లో మళ్లీ అల్లర్లు చెలరేగాయి.

# బలూచిస్థాన్ లో పాక్ కొత్త చట్టం... సైన్యానికి మరింత పవర్!

పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్‌లో వేర్పాటువాద ఉద్యమాన్ని నియంత్రించేందుకు అక్కడి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తరచూ వివాదాస్పదమవుతున్నాయి. తాజాగా, బలోచిస్థాన్ అసెంబ్లీ ఆమోదించిన ఉగ్రవాద వ్యతిరేక (సవరణ) చట్టం 2025, స్థానికంగా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. పౌరులు, మానవ హక్కుల సంఘాలు ఈ చట్టంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**చట్టంలోని వివాదాస్పద అంశాలు**

బలూచ్ పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ చట్టాన్ని రూపొందించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ఎటువంటి నేరారోపణలు లేదా కేసులు నమోదు కాకపోయినా, కేవలం అనుమానం ఆధారంగా వ్యక్తులను అదుపులోకి తీసుకునే అధికారం పాకిస్థాన్ సైన్యానికి, నిఘా సంస్థలకు దఖలుపడుతుంది. అరెస్టు చేసిన వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టకుండానే 90 రోజుల వరకు నిర్బంధంలో ఉంచవచ్చు. అంతేకాకుండా, కోర్టుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే సోదాలు నిర్వహించడానికి, వస్తువులు స్వాధీనం చేసుకోవడానికి, వ్యక్తులను నిర్బంధించడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేసేందుకు పోలీసు, నిఘా సంస్థల అధికారులతో కూడిన సంయుక్త దర్యాప్తు బృందాలకు (జేఐటీ) ఈ చట్టం అధికారం కల్పిస్తోంది. కేవలం 'అనుమానం' ఆధారంగా అరెస్టులు చేసే వెసులుబాటు కల్పించడం పట్ల పౌర సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**మానవ హక్కుల సంఘాల వ్యతిరేకత**

ఈ చట్టం ద్వారా పౌరులకు రాజ్యాంగబద్ధంగా లభించే న్యాయపరమైన రక్షణ పూర్తిగా కరువవుతుందని న్యాయ నిపుణులు, మానవ హక్కుల కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రభుత్వ బలగాలు నీడచాటున, అనధికారికంగా సాగించిన చర్యలనే ఇప్పుడు చట్టబద్ధం చేశారని వారు ఆరోపిస్తున్నారు. ఈ చర్యలు అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలను, పాకిస్థాన్ రాజ్యాంగం కల్పించిన పౌర రక్షణలను పూర్తిగా ఉల్లంఘించడమేనని స్థానిక మానవ హక్కుల కమిషన్ ఆఫ్ పాకిస్థాన్ (హెచ్ఆర్‌సిపి)తో పాటు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్ (ఐసీసీపీఆర్) వంటి అంతర్జాతీయ హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

**బలోచిస్థాన్‌లో నెలకొన్న భయానక వాతావరణం**

బలోచిస్థాన్‌లో బలవంతపు నిర్బంధాలు, వ్యక్తులు అదృశ్యమవడం వంటి ఘటనలు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తమ ఆప్తులు ఏమయ్యారో తెలియక అనేక కుటుంబాలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాయి. ఈ అదృశ్యాల వెనుక ప్రభుత్వ హస్తం ఉందనేది బహిరంగ ఆరోపణ. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకురావడం బలూచ్ పౌరులలో మరింత భయాందోళనలను రేకెత్తిస్తోందని పరిశీలకులు అంటున్నారు.

ఈ పరిణామాలపై మానవ హక్కుల సంస్థ బలోచ్ యక్జేతీ కమిటీ (బీవైసీ) తీవ్రంగా స్పందించింది. ఈ చట్టంలోని నిబంధనలు వ్యక్తిగత స్వేచ్ఛకు, ఏకపక్ష నిర్బంధాల నుంచి పౌరులకు లభించాల్సిన రక్షణ హక్కుకు పూర్తిగా విఘాతం కలిగిస్తున్నాయని ఆ సంస్థ తీవ్రంగా విమర్శించింది.

## తెలుగు రాష్ట్రాల్లో విషాదం... 9 మంది జలసమాధి

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం తీవ్ర విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో తీరని దుఃఖం అలుముకుంది. అధికారులు ఈ వివరాలను ఆదివారం వెల్లడించారు.

**తెలంగాణ: మేడిగడ్డలో ఆరుగురి నీట మునక**

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి నదిపై ఉన్న మేడిగడ్డ బ్యారేజీ వద్ద శనివారం స్నానానికి వెళ్లి గల్లంతైన ఆరుగురు యువకుల మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. మృతులను మధుసూదన్ (18), పి. శివ మనోజ్ (15), రక్షిత్ (13), కర్నాల సాగర్ (16), రామ్ చరణ్ (18), పి. రాహుల్ (19)గా గుర్తించారు. వీరంతా అంబటిపల్లి, కొర్లకుంట గ్రామాలకు చెందిన ఒకే కుటుంబ బంధువులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఎనిమిది మంది బంధువుల వివాహ విందుకు హాజరైన తర్వాత సమీపంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్దకు శనివారం స్నానానికి వెళ్లారు. వీరితో పాటు పత్తి వెంకటస్వామి అనే మధ్యవయస్కుడు కూడా ఉన్నారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతుండగా, వెంకటస్వామి, మరో వ్యక్తి సురక్షితంగా బయటపడ్డారు. కాగా, మృతుల్లో మధుసూదన్, మనోజ్.. వెంకటస్వామి కుమారులు కావడం మరింత విషాదకరం. తొలుత ఇద్దరు బాలురు నీటిలో మునిగిపోతుండగా, వారిని కాపాడే ప్రయత్నంలో మిగిలినవారు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిసింది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మేడిగడ్డ వద్ద గోదావరిలో నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణమే భారీస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. నిపుణులైన ఈతగాళ్లు, మూడు బోట్ల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహాదేవ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**ఆంధ్రప్రదేశ్: చెరువులో ముగ్గురు విద్యార్థుల మృతి**

ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివారం మరో విషాద ఘటన చోటుచేసుకుంది. డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయతీ కేంద్రంలోని ఓ చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు పదో తరగతి విద్యార్థులు నీట మునిగి మరణించారు. మృతులను కె. సుశాంత్, జి. భాను తేజం, సాయి కిరణ్‌గా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ ముగ్గురు స్నేహితులు సెలవులు కావడంతో సరదాగా చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే, లోతు అంచనా వేయలేక నీట మునిగి ప్రాణాలు విడిచారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ రెండు ఘటనలతో తెలుగు రాష్ట్రాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వేసవి సెలవులు, వర్షాకాలం ఆరంభంలో నీటి వనరుల వద్దకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు.

## విజయవాడలో 'సెలూన్ కొనికి' ప్రారంభోత్సవం...

- మొదటి పేజి తరువాయి

పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## 2026లో తమిళనాడులో డీఎంకే పాలన క్లోజ్.. NDA కూటమిదే పవర్

- మొదటి పేజి తరువాయి

గద్దె దించి రాష్ట్ర రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలుకుతామన్నారు.

2026లో తమిళనాడులో బీజేపీఅన్నాడీఎంకే కూటమి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత డీఎంకే పాలనను "100 శాతం వైఫల్యం" అని అమిత్ అభివర్ణించారు. నేను ఢిల్లీలో నివసిస్తున్నప్పటికీ.. నా చెవులు ఎప్పుడూ తమిళనాడు వైపే ఉంటాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా డీఎంకేను ఓడించలేరని సీఎం స్టాలిన్ అంటున్నారు.. ఆయన చెప్పింది నిజమే. డీఎంకేను నేను కాదు తమిళనాడు ప్రజలే ఓడిస్తారన్నారు. పార్లమెంటులో సెంగోల్‌ను ప్రతిష్ఠించడం ద్వారా ప్రధాని మోడీ తమిళనాడును గౌరవించారని.. దీనికి ధన్యవాదాలు తెలిపేందుకు తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధానమంత్రికి లేఖ రాస్తారని ఆశిస్తున్నానని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో కూడా మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గద్దె దించి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. కాగా, 2026లో తమిళనాడు, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో విజయం బీజేపీకి ఎప్పటి నుంచో అందని ద్రాక్షగా మిగిలిపోయింది. దీంతో ఎలాగైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రాల్లో విజయం సాధించి కాషాయ జెండా రెపరెపలాడించాలని బీజేపీ వ్యూహాలు మొదలుపెట్టింది.

## దత్తాత్రేయది ఆదర్శ రాజకీయ జీవితం

- మొదటి పేజి తరువాయి

చేయడం సమాజానికి ఎంతో అవసరమని, వారి కథనాలు మార్గదీపికలుగా ఉపయోగపడతాయని చంద్రబాబు అన్నారు.

ఇటీవలే, మే నెలలో ఢిల్లీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ చేతుల మీదుగా దత్తాత్రేయ ఆత్మకథ హిందీ అనువాదం 'జనతా కీ కహానీ %-% మేరీ ఆత్మకథ' పేరుతో విడుదలైంది. దత్తాత్రేయ రాజకీయ, సామాజిక సేవను నిజాయితీగా పొందుపరిచిన ఈ పుస్తకం అప్పట్లో ప్రశంసలు అందుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని తెలుగు పాఠకులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో నేడు తెలుగు అనువాదాన్ని విడుదల చేశారు. తెలుగు ప్రజలతో గవర్నర్‌కు ఉన్న లోతైన అనుబంధాన్ని ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని నిర్వాహకులు తెలిపారు. తన ఆత్మకథ గురించి గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, ఇది తన సామాన్య జీవితం నుండి అత్యున్నత రాజ్యాంగ పదవుల వరకు సాగిన ప్రయాణానికి హృద్యమైన కథనమని తెలిపారు. తన తల్లి దివంగత ఈశ్వరమ్మ తనకు నేర్పిన సానుభూతి, అంకితభావం, సేవా విలువలే తన జీవితాన్ని, వృత్తిని తీర్చిదిద్దాయని ఆయన గుర్తుచేసుకున్నారు. తన జీవిత కథ యువతను నిబద్ధతతో, వినయంతో ప్రజాసేవ వైపు నడిపించాలని ఆశిస్తున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం తెలుగు సాహిత్యం, ప్రజా జీవితంలో ఒక ముఖ్యమైన

ఘట్టంగా నిలుస్తుందని, దక్షిణ భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులలో ఒకరి వ్యక్తిగత, రాజకీయ ప్రస్థానాన్ని పాఠకులకు అందిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇటీవలి విషాద సంఘటనల బాధితులకు నివాళులు అర్పించిన ప్రముఖులు, క్లిష్ట సమయాల్లో ఐక్యతను, స్థితిస్థాపకతను పెంపొందించడంలో నాయకత్వ పాత్రను నొక్కిచెప్పారు.

## మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఏపీ మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రాహ్మణి కూడా మాగంటి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారు హైదరాబాద్ మాదాపూర్‌లోని మాగంటి గోపీనాథ్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించిన అనంతరం, తీవ్ర విషాదంలో ఉన్న గోపీనాథ్ కుటుంబ సభ్యులను లోకేశ్, బ్రాహ్మణి దంపతులు పరామర్శించారు. వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా లోకేశ్ పక్కనే కూర్చున్నారు. అనంతరం, నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా మాగంటి గోపీనాథ్ మృతి పట్ల తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. "జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గారు గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అకాల మరణం పొందడం దిగ్భ్రాంతికి గురిచేసింది, ఇది చాలా బాధాకరం" అని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతో మాగంటి గోపీనాథ్‌కు ఉన్న అనుబంధాన్ని లోకేశ్ సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకున్నారు. "తెలుగుదేశం పార్టీతోనే మాగంటి గోపీనాథ్ గారి రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1982లో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన, 1985లో హైదరాబాద్ నగర తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు" అని లోకేశ్ తెలిపారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడు సార్లు విజయం సాధించి, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. "వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మాగంటి గోపీనాథ్ గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అంటూ లోకేశ్ తన సంతాప సందేశంలో వెల్లడించారు.

## టాలీవుడ్ లో అనూహ్య పరిణామం... ఎన్నికైన ఒక్కరోజుకే సునీల్ నారంగ్ రాజీనామా

- మొదటి పేజి తరువాయి

టీఎఫ్‌సీసీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో సునీల్ నారంగ్ వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్రీధర్‌తో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ నారంగ్ మాట్లాడుతూ, థియేటర్ల విషయంలో తరచూ వినిపించే "ఆ నలుగురు" అనే ప్రస్తావనలో వాస్తవం లేదని, థియేటర్లు వాటి యజమానుల వద్దే ఉన్నాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా, "హీరోలు దేవుళ్ళతో సమానం. వారికి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం ఏ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, నిర్మాత చేయరు" అని వ్యాఖ్యానించారు. అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ గురించి మాట్లాడుతూ, "ఆయన ఒక తుపాను లాంటి వారు, ఆయన సినిమాను ఆపగలిగే శక్తి ఎవరికీ లేదు" అని అన్నారు. అయితే, ఇంతలోనే అనూహ్యంగా ఆదివారం ఉదయం సునీల్ నారంగ్ తన రాజీనామాను ప్రకటించారు. తనను సంప్రదించకుండానే కొందరు వ్యక్తులు ప్రకటనలు జారీ చేస్తున్నారని, తన ప్రమేయం లేకుండా వెలువడుతున్న అలాంటి ప్రకటనలకు తాను ఎలాంటి బాధ్యత వహించబోనని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాను అధ్యక్ష పదవిలో కొనసాగలేనని పేర్కొంటూ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కేవలం ఒక్క రోజులోనే చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలు టీఎఫ్‌సీసీ వర్గాల్లోనూ, మొత్తం తెలుగు చిత్ర పరిశ్రమలోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాజీనామా వెనుక ఉన్న అసలు కారణాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

## కాకాణిని నెల్లూరు జైలుకు తరలించిన పోలీసులు

అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న నెల్లూరు జిల్లా వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీస్ కస్టడీ ముగి సింది. ఈ కేసులో ఆయన ఏ4 నిందితుడిగా ఉన్నారు. కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో అధికారులు ఆయన్ను మూడు రోజుల పాటు విచారించారు. విచారణ అనంతరం, పోలీసులు గోవర్ధన్‌రెడ్డికి ముత్తుకూరులో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత ఆయన్ను నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కోర్టు ఆదేశాల మేరకు, పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కాకాణిని నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. ఇదిలా ఉండగా, గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఈ విచారణలో వెలువడే తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## "వేశ్యలు" అంటూ చేసిన ఈ వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

- మొదటి పేజి తరువాయి

వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం.

వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టం. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడం. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## హంస వాహనంపై సరస్వతీ అలంకారంలో విహరించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు






**తిరుపతి పెన్ పవర్ జూన్ 8 :** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి సరస్వతి అలంకారంలో స్వామివారు హంస వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. వాహన సేవలో డిప్యూటీ ఈవో శ్రీ హరీంధ్రనాథ్, ఏఈవో శ్రీ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు,భక్తులు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## యోగా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి




**అనంతపురం, పెన్ పవర్ జూన్ 08 :** అనంతపురం నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, వారి కుటుంబ సభ్యులు, డిఆర్వో ఏ.మాలోల, జిల్లా అధికారులు పాల్గొనగా, వారి చేత యోగా మాస్టర్లు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా మాసంలో భాగంగా జిల్లాలో ఉన్న నాలుగు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన శిల్పారామంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిల్పారామంలోని ముఖ్యమైన మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తనతో పాటు గ్రామస్థాయి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారన్నారు. మళ్లీ తాడిపత్రిలోని శ్రీ చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈనెల 14వ తేదీన రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం అనంతపురంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం యోగా మెగా ర్యాలీ జిల్లా కేంద్రంలో, మండల కేంద్రాల్లో, గ్రామస్థాయిలో కూడా జరగబోతోందన్నారు. యోగా ప్రాముఖ్యత గురించి అందరికి తెలియజేయడంలో కృషి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అందరూ కూడా స్పందిస్తున్నారన్నారు. యోగా ఆరోగ్యానికి మంచిదవుతుందని, యోగా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిఐపిఆర్ఓ పి.గురుస్వామిశెట్టి, డిఎల్డిఓ లలితాబాయి, తహసీల్దార్ హరికుమార్, ఆయుష్ అధికారులు డా.భాస్కర్, డా.లాల్యా నాయక్, యోగా గురువు కృష్ణవేణి, వివేకానంద యోగ సెంటర్ గురువు వై.ఆంజనేయులు, యోగ సెంటర్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

### 12వ తేదీ లోపు

## ప్రభుత్వ పాఠశాలలకు మెటీరియల్

### - స్టేట్ మోడల్ ఆఫీసర్ సుబ్బారావు



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 8 :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 12వ తేదీలోపు విద్యార్థులకు సంబంధించినటువంటి మెటీరియల్స్ అన్నియు ఆయా పాఠశాల హెడ్మాస్టర్లకు వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని స్టేట్ మోడల్ ఆఫీసర్ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆకస్మికంగా పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి ఆలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం గోడౌన్లో ఉన్న స్టాకు వివరాలను, రిజిస్టర్లను, తదితర రికార్డులను వారు పరిశీలించారు. టెక్స్ట్ బుక్కులు నాణ్యతగా ఉన్నాయా? లేవా?, యూనిఫారంకు సంబంధించినటువంటి వివిధ పరికరాలు లను కొలతవేసి పరిశీలించారు. విద్య



సామాగ్రికి భద్రత ఎలా ఉంది? అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యను అన్ని ప్రభుత్వ పాఠశాలలో పెంచే విధంగా హెడ్మాస్టర్లకు, ఉపాధ్యాయులకు, తగిన సూచనలు, సలహాలు అవగాహన తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన టెక్స్ట్ బుక్కులు, నోర్సులు, యూనిఫార్, బెల్టు లు,షూస్ అన్నీ కూడా అనుకున్న టార్గెట్ ప్రకారం పంపిణీ చేయాలని తెలిపారు. రాజేశ్వరి దేవి మాట్లాడుతూ ప్రస్తుతం గత వారం రోజులుగా ఆయా పాఠశాలలకు విద్యార్థులకు సంబంధించిన విద్యాసామాగ్రిని పంపిణీ చేస్తున్నట్లు కూడా వారు అధికారికి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ - 1 రాజేశ్వరి దేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండవ రోజు తెప్పపై విహరించిన శ్రీసుందరరాజ స్వామి




**తిరుపతి పెన్ పవర్ జూన్ 8 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండవరోజు ఆదివారం పద్మసరోవరంలో శ్రీ సుందరరాజ స్వామి వారు తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, నిర్వహించారు. మధ్యాహ్నం 03.00 నుండి 4.30 గంటల వరకు స్వామి వారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. ఇందులోభాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ సుందరరాజ స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంధ్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా స్థాయి సైనింగ్ స్టార్ట్ అవార్డుల ప్రధానం...



**చిత్తూరు, పెన్ పవర్ జూన్ 08 :** విద్యార్థుల్లో ప్రతిభ పాటవాలు పెంపొందించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు తలపెట్టిన సైనింగ్ స్టార్ట్ అవార్డుల కార్యక్రమం జూన్ 9వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించబడునని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఇన్చార్జి మినిస్టర్, మరియు ఎమ్మెల్యే లు పాల్గొంటారని, జిల్లాలోని 31 మండలాల నుండి పదవ తరగతి లో అత్యధిక మార్కులు పొందిన 190 మంది విద్యార్థులకు మరియు ఇంటర్మీడియట్ నందు 33 మంది విద్యార్థులకు అవార్డులు అంద జేయబడునని,ఒక్కొక విద్యార్థికి ప్రశంసా పత్రం, 20,000 రూపాయల నగదు బహుమతి, మెడల్ అంద జేయబడినని, ఎంపికైన విద్యార్థులు ఐడి కార్డు లేదా ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని రావాలని, ప్రతి విద్యార్థితో పాటు తల్లిదండ్రులలో ఒకరు ఆధార్ కార్డుతో అనుమతించ బడతారని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## గణపతికి శాస్త్రోక్తంగా బాలాలయం కార్యక్రమం



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి /జూన్ 8 :** శ్రీకాళహస్తీశ్వరలో ఆది వారం గణపతి స్వామికి బాలాలయం కార్యక్ర మాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా కలశ స్థాపన గావించి విశేష పూజలు చేశారు. అనంతరం హోమం వేసి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి, దేవస్థానం ఏ.ఈఓ విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 8 :** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళను మన కాన్వాయ్ లోని డిఎస్పీ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తన మానవత్వాన్ని చాటుకున్నారు.

చిల్లకూరు మండలంలోని బూధనం గ్రామానికి చెందిన సొంగా భవాని రాజశేఖర్ దంపతులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవడం కోసం తమ ఇంటి నుండి మోటార్ బైక్‌పై బయలుదేరి శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా, నాయుడుపేట పట్టణ సమీపంలోని విన్నమాల వద్ద ప్రమాదవశాత్తు డివైడర్ను ఢీకొని బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళుతున్న భార్యాభర్తలకు గాయాలయ్యాయి.అదే సమయంలో నాయుడుపేట నుండి సూళ్లూరుపేటకు వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బైక్ ప్రమాదాన్ని గుర్తించి, క్షతగాత్రులను పరామర్శించి, చికిత్స నిమిత్తం వారిని డిఎస్పి వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్లతో మాట్లాడారు.

## పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి




**శ్రీకాళహస్తి/పెన్ పవర్/ప్రతినిధి/జూన్ 8 :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు "కొన్నలి రమేష్" ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలం అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## 2047 సంవత్సరం నాటికి ఆరోగ్యకరమైన, సంపన్నమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం




**కర్నూలు, పెన్ పవర్ జూన్ 08 :** 2047 సంవత్సరం నాటికి ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ తెలిపారు. ఆదివారం యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగంగా కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు పైన ఉన్న రూపాల సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కర్నూలు ఆర్డీఓ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2047 సంవత్సరం నాటికి ఆరోగ్యకరమైన, సంపన్నమైన మరియు సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యమన్నారు. అందులో భాగంగానే యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఈరోజు ఇక్కడ నిర్వహించిన కార్యక్రమాన్ని చాలా విజయవంతం చేశారని ఇదే స్ఫూర్తితో జూన్ 21వ తేదీ నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమంలో కూడా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెట్కూరు సీఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ జూన్ 21 వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ సుధాకర్ రెడ్డి, సైనిక్ వెల్ఫేర్ అధికారి, కర్నూల్ మండల తహసీల్దార్ రమేష్, దిన్నెదేవరపాడు సర్పంచ్ మాధవస్వామి తాంద్రపాడు సర్పంచ్ జయన్న, టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తమ్ రెడ్డి, యోగా అసోసియేషన్ కార్యదర్శిఅవినాష్, యోగ శిక్షకులు, ప్రజలు పాల్గొన్నారు.

## భారతీయ నాట్య శిక్షణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం లాంటిది



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 8 :** భారతదేశంలో నాట్యమునకు సంబంధించిన వివిధ నాట్య కళలు లో శిక్షణ అనేది సాంప్రదాయాలకు నిలయము లాంటిదని ముఖ్య అతిథులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాంస్కృతిక మండలి లో పట్టణములోని ఎస్బిఐ కాలనీ మానస నృత్య కళా కేంద్రం వారి ఆధ్వర్యంలో వేసవి నాట్య శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని గురువు మానస నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కగ్గోలు హరీష్ కుమార్ (మంత్రి గారి నియోజక వర్గ ఇంచార్జీ),కోట శంకర్రావు (ప్రముఖ రంగస్థల, బుల్లితెర, చలన చిత్ర నటులు) మల్లాది భాస్కర్ (రంగస్థల, సినిమా, బుల్లితెర నటులు), జబర్దస్త్ అప్పారావు, తేజోమూర్తుల మురళీధర్ ( రచయిత&దర్శకులు), అల్లరి అర్జున్ (టి.వి&సినిమా యాక్టర్),పెద్దిపోగు ఆనంద్ (రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్), సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్ హాజరు కావడం జరిగింది. గురువు మానస ద్వారా 50 మంది చిన్నారులు శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత, వారు నేర్చిన నాట్యమును ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శన అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలోశ్రీ విఘ్నరాజం భజే, "మహిషాసుర మర్దిని", నీలి మేఘములలో నగుమోము కలవాడే, అదివో అల్లదివో, చిన్ని శిశువు,లాంటి నాట్యములు ఎంతో ఉత్సాహభరితంగా ప్రదర్శన ఇవ్వడం ప్రేక్షకులను మైమరిచే విధంగా జరిగాయి.

అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ అతి చిన్న వయసులో గురువు మానస తాను నేర్చిన నాట్యమును ఇతరులకు నేర్పించాలన్న తపన, ఆకాంక్ష ఉండడం, చదువులో కూడా దిట్టగా ఉండడం నిజంగా భగవంతుడు ఇచ్చిన వరము అని తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాలలో రాష్ట్రాలలో వీరి నాట్య ప్రదర్శన మంచి గుర్తింపు పొందడం మన ధర్మావరానికే గర్వ కారణమని వారు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమొటోలు అందజేశారు. తదుపరి ముఖ్య అతిథులను గురువు మానస ఘనంగా సత్కరించారు. తదుపరి మానస ప్రదర్శించిన వారి శిష్య బృందం ను మెచ్చి, మానసను కూడా ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, కళాకారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు పిజిఆర్ఎస్ ఉ.10 గంటల నుండి మ. 2 గంట వరకు : జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ జూన్08 :** ప్రతి సోమవారం జిల్లా కేంద్రం తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు మరియు రెవిన్యూ డివిజన్ , మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జూన్ నెల 9వ తేదీ (నేడు) సోమవారం రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటవరకు ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ గారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంట వరకు జిల్లా కలెక్టరేట్ తో పాటుగా డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహించే ప్రజా సమస్యల పరిస్కార వేదికలో ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు అందరు కలెక్టరేట్ నందు నిర్వహించే పీజీ ఆర్ ఎస్ కార్యక్రమానికి, అలాగే డివిజన్, మండల కేంద్రాల్లో పీజీఆర్ఎస్ కు సంబంధిత అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం తప్పక హాజరు కావాలని తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు కూడా వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు... కార్యదర్శి డా. ఆది శేషు



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 8 :** శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన సభ్యత్వ గోడపత్రికలను బాబు జగ్జీవన్ రామ్‌నగర్‌లోని శ్రీ సత్య చిన్నపిల్లల హాస్పిటల్ దగ్గర జేవీవీ నాయకులు విడుదల చేసారు. ఈ సంధర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, కోశాధికారి చంద్రశేఖర రెడ్డి , ప్రముఖ చిన్నపిల్లల వైదుడు డాక్టర్ విక్రాంత్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ బాబు మట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాలుగా తెలుగు ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యం చేస్తోందన్నారు.నేడు ధర్మా ధర్మముల మధ్య, సత్యా సత్యముల మధ్య ఘర్షణ జరుగుతున్నది అని తెలిపారు. ఈ ఘర్షణలో బుద్ధి జీవులు ఏ పక్షం వహించాలో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు అని తెలిపారు. చివరకు జ్ఞానం, అజ్ఞానాన్ని సత్యం అసత్యాన్ని తప్పక జయిస్తాయి అని తెలిపారు. 100 సంవత్సరాల క్రితమే కందుకూరి వీరేశలింగం పంతులు అన్నాడని తెలిపారు. పోరాటం ఈనాటికీ కొనసాగుతూనే ఉందన్నారు. జీవుల జన్యు నిర్మాణం గురించి వచ్చే రోగాల గురించి వాటి చికిత్స గురించి ఎంతో ముందుకు వెళ్ళాము కానీ ఇంకా మన సమాజంలో అశాస్త్రీయ భావజాలం రాజ్యమేలుతూనే ఉందన్నారు. దీనికి సైన్సు అందిస్తున్న ఫలితాలు సామాన్యుని వద్దకు చేరకపోవడమేనన్నారు. సైన్సు ఇప్పటికీ పాఠ్య గ్రంథాలలో ఉంది తప్ప జీవన విధానంగా మారలేదన్నారు.సైన్స్ అవగాహన పెంచడం ద్వారా సామాన్యులు సైన్స్ ఫలితాలను అందుకోవాలనే ఆలోచనలో నుంచి రాష్ట్రంలో జన విజ్ఞాన వేదిక ఏర్పడిందన్నారు. మనం చేసే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని ఆటంకపరచే శక్తులు అడ్డుకునే శక్తులు సామాజిక వ్యవస్థలో ఉన్నాయన్నారు. అలాంటి హేతు విరుద్ధ శక్తుల పట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే కర్తవ్యం జనవిజ్ఞాన వేదిక చేస్తున్నదన్నారు.అనేక రంగాలలో మునుపెన్నడూ ఊహించని ఆవిష్కరణలతో శాస్త్ర విజ్ఞానం దూస్సుకుపోతున్నా, మధ్యయుగాల చాందస సంకుచిత భావాలు ప్రజానీకాన్ని విజ్ఞాన ఫలాలను అందుకోనీయకుండా చేస్తున్నాయన్నారు. ప్రజలకు చేరువగా, ప్రజల కోసం విజ్ఞాన ఫలాలు ఉపయోగపడాలని జనవిజ్ఞాన వేదిక ఆకాంక్షిస్తోందన్నారు. తెలుగు ప్రజల్లో పనిచేస్తున్న అతి పెద్ద ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థగా జనవిజ్ఞాన వేదిక అందరి అభిమానాన్ని పొందగలిగిందన్నారు.అక్షరాస్యత ,సారా వ్యతిరేక ఉద్యమం, కూల్ డ్రింక్స్ వ్యతిరేక ప్రచారం ,ఆరోగ్య ప్రచారం ,పిల్లల్లో సృజనాత్మకత కోసం ప్రయత్నాలు, పర్యావరణం వంటి అంశాలతో పాటు పిల్లలకు సైన్సు పట్ల అభిరుచి పెంచేందుకు చెకుముకి పత్రికను నిర్వహిస్తున్నదన్నారు. మనిషి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించుకునే శక్తి మనిషికే ఉందన్నారు.ఆ సమస్యలకు పరిష్కారాలు కూడా సమాజంలోనే ఉన్నాయన్నారు. సామాజిక అంశాల విశ్లేషణ, అధ్యయనాలను శాస్త్రీయ హేతువాద దృక్పథంతో చేసే ఆలోచనని ప్రజానీకంలో ప్రోది చేయాలన్న ఆశయంతో పని చేసే ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థ జనవిజ్ఞాన వేదికలో సభ్యులు కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఒక ఉన్నతమైన శాస్త్రీయ సమాజ కోసం ప్రజాసైన్స్ ఉద్యమానికి తోడ్పాటు అందించాల్సిందిగా కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు సురేష్, నరేంద్ర బాబు, నాగేంద్ర, ఖలందర్, మల్లికార్జున, మనోహర్, జంగమన్న, వినయ్ పాల్గొన్నారు.

## నిరంతరం కొనసాగుతున్న హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు




**శ్రీకాళహస్తి /పెన్ పవర్/ ప్రతినిధి/ జూన్ 8 :** శ్రీకాళహస్తిలో గత 160 నెలలుగా హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు, ప్రత్యేక ప్రతిభావంతులకు, వృద్ధులకు,పేదలకు నెలకు సరిపడు నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తూ ఉన్నారు. అందులో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని నగిరి వీధిలో చిల్డ్రన్స్ ఫ్యాన్సీ స్టోర్ వద్ద 161 వ నెల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ పేద ప్రజలకు, మానసిక దివ్యాంగులైన 35 కుటుంబాలకు హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ వ్యవస్థాపకులు మునీర్ భాష 161 నెలలుగా నిరంతరం నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తుండడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వచ్చి పేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు తమ వంతు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్ సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ భాష, బాబా ఫరీద్, హరినాథ్ నాయుడు, హెల్పింగ్ హాండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యప్రభ వాహనంపై గోవిందరాజస్వామి కటాక్షం









**తిరుపతి పెన్ పవర్ జూన్ 8 :** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన ఆదివారం ఉదయం 7 గంటలకు గోవిందరాజస్వామి వారు సూర్యప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంంగళవాయిద్యాల నడుమ వాహన సేవ సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

సూర్యుడు తేజోనిధి, సకలరోగ నివారకుడు, ప్రకృతికి చైతన్యప్రధాత. వర్షాలు, వాటివల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఓషధులు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. అట్టి సూర్యప్రభను అధిష్టించి స్వామి ఊరేగడం ఆనందదాయకం. అనంతరం ఉదయం 10.00 నుండి 11.00 గంటల వరకు సతీసమేతంగా గోవిందరాజస్వామివారికి స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, చందనంతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వాహన సేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటి ఈవో శ్రీమతి శాంతి, ఏఈవో శ్రీ మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రైతులు వంటల విషయంలో సస్యరక్షణ నీటి యాజమాన్యంపై అవగాహన : రెడ్డిపల్లి శాస్త్రవేత్తల బృందం



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 8 :** రైతులు తమ పంటల విషయంలో సస్యరక్షణతో పాటు నీటి యాజమాన్యంపై తప్పక అవగాహన కలిగి ఉన్నప్పుడే పంటలు దిగుబడి తప్పక వస్తుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్తల బృందం తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గొట్టూరు గ్రామంలోవికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని చింతలపల్లి, గొట్లూరు గ్రామాలలో చేపట్టడం జరిగింది.ఇందులో భాగంగా జాహ్నవి ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం రెడ్డిపల్లి వారు వేరుసెనగ, కంది, శెనగ, బత్తాయి పంటలలో వాటిలో వచ్చే చీడ పీడలు వాటి సస్యరక్షణ, నీటి యాజమాన్యం గురించి తెలిపారు. బి.చందన కెవికె రెడ్డిపల్లి వారు, వారు అందిస్తున్న సేవలు, విత్తనాల లభ్యత, డ్రోన్ ద్వారా పిచికారి తదితర అంశాలను తెలియజేశారు. డా.రఘుకరన్ వారు కోళ్ల, పొట్టేల యాజమాన్య పద్ధతుల, తెలియచేశారు.

డాక్టర్ శేఖర్, వివో ధర్మవరం వారు పథకాల పై తెలియ చేశారు. ధర్మవరం మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ధర్మవరం మండల వ్యవసాయ అధికారి భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని వాటితో పాటు పథకాలపై రైతులకు సూచించారు. హెచ్ ఓ. అమరేశ్వరీ ఉద్యానవన పథకాల, చిదపిడలపై పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం క్లస్టర్ ఇన్చార్జ్ చింతలపల్లి మహేష్ చౌదరి, నీటి సంఘాల ప్రెసిడెంట్ కాటమయ్య, నారాయణ, శాస్త్రవేత్తలు జాహ్నవి, ఏఆర్ఎస్ రేకులకుంట, డా.రఘు కరణ్, ఎల్ఆర్ఎస్ సిద్ధారాపురం, డా.శేఖర్, వివో కందుకూరు, ఎస్ఎంఎస్. బి.చందన, ఎంఏఓ శ్రీ ముస్తఫా, హెచ్ఓ అమరేశ్వరీ, రౌతుసేవ కేంద్ర, సచివాలయం సిబ్బంది స్వాతి, అశ్విని, భార్గవ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యం

**- అ.. జయసింహ, కో.. సుదర్శన్ గుప్త**



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 8 :** పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే రోటరీ క్లబ్ యొక్క ముఖ్య లక్ష్యము అని క్లబ్ అధ్యక్షుడు జయసింహ, కోశాధికారి సుదర్శన్ గుప్త, క్యాంపు చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం జయసింహ, సుదర్శన్ గుప్తా మాట్లాడుతూ ఈ శిబిరం రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరానికి దాతలుగా అన్నపూర్ణ రెడీ మిక్స్ కాంక్రీట్..(దాత చంద్రశేఖర్) అనంతపురం దాతృత్వంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరానికి 175 మంది రోగులకు కంటి వైద్య చికిత్సలను అందించగా అందు లో 136 మంది ఆపరేషన్‌కు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు 35,000 మందికి ఆపరేషన్లతో పాటు ఉచితంగా కంటి అద్దాలను కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. తదుపరి ఆపరేషన్ ముందు ఆపరేషన్ తర్వాత పాటించవలసిన నియమములు సూచనలు, వైద్యులు తెలపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, శివయ్య, రమేష్ బాబు, కొండయ్య, సత్రశాల ప్రసన్నకుమార్, మనోహర్ గుప్తా, కృష్ణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల స్థలాలు సాగుభూములు సాధన కోసం..

## 10న ధర్నాలు జయప్రదం చేయండి




**కడప పెన్ పవర్ జూన్ 8 :** ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కేంద్రంలో రాష్ట్రంలో పాలకులు మారుతున్న వ్యవసాయ కూలీల బ్రతుకులు మారడం లేదని 78 సంవత్సరాల భారతావనిలో ఇంకా వ్యవసాయ కూలీ మాకు ఇంటి స్థలం కావాలి సాగు భూములు ఇవ్వాలని అడగటం బాధాకరమని అందుకే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 10న కడప జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించాలని ఉపాధి కూలీల సమస్యల కోసం ఉద్యమించాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు.

ఆదివారం సిపిఐ కార్యాలయం హెచ్ మేన్ భవనం నందు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... నరేంద్ర మోడీమూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేశారని అందుకే అటు కేంద్ర బడ్జెట్ లో గాని రాష్ట్ర బడ్జెట్లో గాని సరైన నిధులు కేటాయింపులు జరగడంలేదని పేరుకేమో వికసిత భారత్ అని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ దేశంలో పేదరికం ఆకలి దరిద్రం నిరుద్యోగం తగ్గింది లేదని పైపెచ్చు రైతులు ముస్లిం మైనార్టీల పైన దాడులు చేయడమే గాక వారికి వ్యతిరేకమైన చట్టాలను తీసుకొస్తున్నారని తినే తిండి పైన కట్టుకునే బట్ట పైన ఆన్సర్ విజిస్తున్నారని కులం పేరుతో మతం పేరుతో రాజకీయాలు చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని ఇంతటి అప్రజా స్వామీక విధానాలను మునిపెన్నడూ చూడలేదని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో గొప్పగా చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు 1 కూడా అమలు కావడం లేదని గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి మేమే ఇండ్ల నిర్మాణం చేస్తామని చెబుతున్న ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అదేవిధంగా నేటికీ తల్లికి వందనం డబ్బులు వేయలేదని తక్షణమే వారి అకౌంట్లో డబ్బులు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు అదేవిధంగా ఉచిత బస్సు ప్రయాణం మూడు సిలిండర్లు ఇవ్వాలని ఆయన కోరారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నప్పటికీ అనేక అవకతవకలు అక్రమాలు జరుగుతున్నాయని వందల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి ప్రతి వ్యవసాయ కూలీకి చేసిన పనికి తగ్గట్టు కూలి రేట్లు పెంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం జిల్లా నాయకులు బ్రహ్మం, పొంగూరు నాగరాజు కృష్ణ శ్రీను తిరుపాల్ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ జూన్ 08 :** జూన్ 9న సోమవారం చిత్తూరు కలెక్టరేట్ లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉ.9.30 గం.ల నుండి మ.1 గం.వరకు కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం నందు నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ కార్యక్ర మానికి జిల్లా అధికారులు ఉ.9 గం.కల్లా తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజక వర్గ,మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

### 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో

## ప్రజలందరూ పాల్గొనేలా అవగాహన కల్పించాలి

ప్రతి గ్రామస్థాయిలో, వార్డు స్థాయిలో, హాబిటేషన్ల స్థాయిలో, అన్ని నివాస ప్రాంతాలలో ర్యాలీలు విజయవంతంగా : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 08 :** జూన్ 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమం మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 9వతేదీన గ్రామ మరియు వార్డు సచివాలయాల పరిధిలో యోగా గురించి అవగాహన పెంచేందుకు యోగా ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అన్ని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలలో ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారన్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగాపై ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామస్థాయిలో, వార్డు స్థాయిలో, హాబిటేషన్ల స్థాయిలో, అన్ని నివాస ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సచివాలయ స్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఆ సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు యోగా గురించి అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాని ప్రాక్టీస్ చేయాలని వారికి తెలియజేయడం జరుగుతుందన్నారు. యోగా ర్యాలీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ యోగా ర్యాలీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఒకచోట, జాయింట్ కలెక్టర్ గ్రామీణ ప్రాంతంలో ఒకచోట పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ, వార్డు స్థాయి నుండి పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మేయర్, మునిసిపల్ చైర్‌పర్సన్‌ల వరకు అందరు ప్రజాప్రతినిధులు పాల్గొని యోగా ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పెండింగ్‌లో ఉన్న డిఆర్, పీఆర్సీ బకాయిలు చెల్లించండి

**అసోసియట్ అధ్యక్షులు గురురజారావు**




**పలమనేరు జూన్ 8,(పెన్ పవర్) :** రాష్ట్రంలో వున్న 4లక్షల మంది పెన్షనర్లకు గత 5సంవత్సరాలుగా పెండింగ్లోనున్న డిఆర్,పీఆర్సీ బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అసోసియట్ అధ్యక్షులు గురురాజారావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణము లోని నార్త్ పాఠశాలలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ కార్యవర్గ సమావేశములో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జూలై 2018 నుండి 2023 మధ్య వరకూ చెల్లించ వలసిన డి.ఆర్, పిఆర్సి బకాయిలు మొత్తం 9 కోట్ల రూపాయలు చెల్లించ వలసి ఉందన్నారు.పైన తెలిపిన బకాయిలను తీసుకోకుండానే గత 5 సంవత్సరాలుగా వేలాది మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం చనిపోయిన కుటుంబ సభ్యులకు కూడా చెల్లించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పెన్షనర్ల కృషి మద్దతు గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా అభినందనలు తెలిపార న్నారు. ప్రస్తుత ముఖ్యమం ఎన్నికల వాగ్దానాలలో సభ్యులకు తెలిపినట్లుగా బాకాయిలను వెంటనే విడుదల చేసి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పెన్షనర్ల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ హెచ్.ఎస్ పథకానికి 10 లక్షలమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ప్రతి ఒక్కరు నెలకు రూ 225, ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్నామన్నారు. మొదటి క్లెయిమ్ రూ.2 లక్షల నుండీ 5 లక్షలకు పెంచాలన్నారు. పై సమస్యలను ఇంతవరకూ పరిష్కారం చేయనందుకు సబ్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.ఇందులో సబ్యులు క్రిష్ణమూర్తి, ఆర్ముగం మోహన్, గౌడు, మస్తాన్, బాలసుబ్రమణ్యం, మాలతి, నాగభూషణం, రెడ్డమ్మ, చంద్రశేఖర్, జగదిష్, అక్బర్ బాషా, సుబ్రమణ్యం, బద్రమ్మ, గోవిందయ్య,గురు స్వామి నాయుడు, గుణశేఖర్, మదు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 08 :** రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. ఆదివారం రాత్రి అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆర్థో వార్డు, సర్జరీ వార్డులో గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామం సమీపంలో శనివారం రాత్రి లారీ, బొలెరో వాహనం ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, వారి కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు అండగా ఉంటామని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఆర్థో హెచ్.ఓ.డి డా.ఆత్మరాం, ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి ఆణిముత్యం

### ఆసాములను, భూస్వాములుగా మారుస్తున్న వీఆర్వో...

### ఓజిలి రెవెన్యూ కార్యాలయంలో లంచాల రాబందు



**ఓజిలి, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 8 :** తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, మన వాలి గ్రామ వీఆర్వో అవినీతి బాగోతం తొవ్వేకొద్దీ టన్నుల్లో బయటపడుతుంది. అమాయకంగా కనిపిస్తూ అవినీతి సొమ్ము కోసం ఆఫీసుకు వచ్చే అభాగ్యులను అష్ట కష్టాలు పెడుతున్నాడు. అవినీతి సొమ్ము ఆశించి ఆసాములను, భూస్వాములుగా మారుస్తున్నాడు. పైసలు ఇస్తే చాలు ఎవరైనా సరే,ప్రభుత్వ భూమిని ధారాధత్వం చేసి పట్టాలి ఇప్పిస్తాడు. ఈ వీఆర్వో అవినీతి ఆకలి తీర్చుకోవడంలో బకాసురుడిని మించిపోతున్నారు. గతంలో గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన. ఓ మహిళ సర్వే నంబర్ 120/1లో మనవాలి గ్రామంలో కొంత భూమిని కొనుగోలు చేశారు.. ఇక ఆ భూమిని కూడా.. అప్పటి ఓజిలి మండల తహసిల్దారు మరియు ఈ వీఆర్వో అండదండలతో... తెలుగుదేశం నాయకుడిగా చలామణి అవుతున్న మరో వ్యక్తి పేరు పై నాలుగు ఎకరాలు.. పట్టా ఇప్పించడంలో ప్రధాన పాత్ర పోషించాడు ఈవిఆర్ఓ దిలీప్.. అబ్బో ఆయన అవినీతి బాగోతం అంతా.. ఇంతా.. కాదు.. రాస్తే రామాయణం... తీస్తే మహాభారతం అవుతుంది... ఆయన చేసే అవినీతిని బయటపడితే... సదరు వ్యక్తులను బెదిరించడం ఆయనకు ఆనవాయితీ... లోకాయుక్తలో ఫిర్యాదుకి.. అన్ని అర్హతలు కలిగిన ఏకైక వ్యక్తి విఆర్ఓ దిలీప్ కుమార్ దిలీప్ ఇటీవల ఇదే విషయంపై విలేకరుల వివరణ అడగడానికి సదరు కార్యాలయానికి వెళ్ళినప్పుడు.. ఆయన దురుసు ప్రవర్తన చూసి.. విస్తుపోయారు. విలేకరులమని చెబుతున్న కూడా ఆయన ప్రవర్తన ఇంత దురుసుగా ఉంటే... ఇక సాధారణ ప్రజలు.. పట్ల ఆయన ప్రవర్తన ఎలా ఉంటుందో.. అంతుచిక్కని ప్రశ్న.. మనవాలి గ్రామం పారిశ్రామికంగా రోజుకి రోజు అభివృద్ధి చెందడంతో అక్కడ భూములు ధరలు అమాంతంగా పెరగడంతో ఇదే అదునుగా భావించిన విఆర్ఓ ప్రభుత్వ స్థలాలను తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు పట్టాలి ఇస్తున్నాడు. అధికారులు మాత్రం వీఆర్వో చేస్తున్న అవినీతి గురించి విని ఊకొడుతున్నారు, ఇలా వార్త కథనాలుగా వచ్చినప్పుడు ఉలిక్కిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఇలాంటి అవినీతి వీఆర్వో మీద చర్యలు తీసుకోవాలంటూ మండల ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసులు ఆకస్మిక దాడి



**పెళ్లకూరు,పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 8 :** తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామ పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడి చేశారు. ఈ సంఘటనలు ముగ్గురు వ్యక్తులతో పాటు మూడు సెల్ ఫోన్లు, నాలుగు బైకులు, 3100/- రూపాయలు నగదును స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఎస్ ఐ నాగరాజు సహచర సిబ్బందితో కలిసి పోలీసు స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి కార్యకలాపాలు ఎక్కడైనా, ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జీవితంలోని భౌతిక వనరులతో మనం నిజంగా హృదయపూర్వకంగా సంతృప్తి చెందుతామా...

### - సి.వి.విజయభాస్కర్ రెడ్డి



కడప పెన్ పవర్ జూన్ 8 : ఆత్మ - సంతృప్తి చెందిన వ్యక్తులు నేను మా ఊరికి వెళ్లేందుకు బస్టాండ్‌లో వేచి ఉన్నాను. బస్సు ఇంకా రాలేదు.

నేను అక్కడ కూర్చుని పుస్తకం చదువుతున్నాను. నన్ను చూసి, దాదాపు 10 సంవత్సరాల వయసు ఉన్న అమ్మాయి నా దగ్గరకు వచ్చి,"సార్, ఈ పెన్నులు కొనుక్కోండి, నేను మీకు నాలుగు పెన్నులు రూ.10కి ఇస్తాను, నాకు చాలా ఆకలిగా ఉంది, నాకు ఏదైనా తినడానికి ఉంటుంది." ఆమెతో పాటు ఒక చిన్న పిల్లవాడు కూడా ఉన్నాడు, బహుశా ఆమె తమ్ముడనుకుంటాను. నేను, "కానీ, నాకు పెన్ను అవసరం లేదమ్మా", అన్నాను. ఆమె తర్వాత చాలా ముద్దుగా ఇలా ??అడిగింది,"అప్పుడు మేము ఏం తింటాం?" "నాకు పెన్ను వద్దు, కానీ నువ్వు తప్పకుండా ఏదోకటి తింటావు" అన్నాను నా బ్యాగ్ లో రెండు బిస్కెట్ల ప్యాకెట్లు ఉన్నాయి. నేను ఆ రెండు ప్యాకెట్లను తీసి, ఇద్దరికీ చెరొకటి ఇచ్చాను. కానీ ఆమె ఒక ప్యాకెట్ తిరిగి ఇచ్చేసి, "అయ్యగారు! ఒక్కటి చాలు, ఇద్దరం పంచుకుంటాం" అని చెప్పడంతో నేను చాలా ఆశ్చర్యపోయాను. నేను మళ్ళీ " ఫర్వాలేదు, ఈ రెండూ ఉంచుకో " అన్నాను. దానికి ఆ అమ్మాయి అడిగిన ప్రశ్న నన్ను, నా హృదయాన్ని, నా ఆత్మను కూడా కదిలించింది. "అప్పుడు మీరు ఏమి తింటారు?" అని అడిగింది. కోట్లాది కోట్లు సంపాదిస్తున్న మనుషులు మానవత్వాన్ని పక్కనపెట్టి విజయం పేరుతో ప్రజలను విపరీతంగా దోచుకుంటున్న ఈ ప్రపంచంలో, ఆకలితో ఉన్న ఓ అమ్మాయి నాకు మానవత్వపు ఉన్నతమైన పాఠాన్ని నేర్పింది. ఆత్మతో సంతృప్తి చెందేవాళ్ళు ఇలాగే ఉంటారేమో అని నాలో నేనే అనుకున్నాను. దురాశతో వాళ్ళ వంతు కూడా తినేసేంతగా ఎదుటివారి వద్ద నుండి తీసుకోకండి ...!! ఒక ప్రాథమిక సూత్రం ఉంది - తీసుకునే కంటే ఎక్కువగా ఇవ్వండి. ఈ లక్షణాలు ఆధ్యాత్మిక సాధన, స్వీయ అధ్యయనం ద్వారా ఎదిగిన వ్యక్తిలో వ్యక్తమవుతాయి.



**దాజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన కేంద్రము కడప.**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**

# గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తే పినాక లక్ష్యం

### - ఐఆర్ఎస్ అడిషనల్ కమీషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్ యాదగిరి



**పలమనేరు మే 8, గంగవరం :** మండలంలోని ఏ.జె.సి.కళ్యాణ మండపంలో పినాక ప్రజాసాధికార ట్రస్ట్ ఆధ్వర్యంలో రూరల్ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తు తమ ముఖ్య లక్ష్యమని ఐ.ఆర్.ఎస్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్ హైదరాబాద్, పినాక ప్రజా సాధికార ట్రస్ట్ వ్యవస్థాపకులు యాదగిరి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి.గాయత్రీ మేనేజింగ్ ట్రస్ట్ అఫ్ పినాక పీపుల్స్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ తిరుపతి, కే.జీ.కృష్ణమూర్తి ఫార్మర్ అడిషనల్ హైకోర్టు, ధర్మ తేజ మేనేజింగ్ డైరెక్టర్ బెంగళూర్, రెడ్డప్ప టీవీ 45 హైదరాబాద్, రమణ డైరెక్టర్ ప్రగతి ఎన్జీవో తిరుపతి, లైన్ రాజారామ్ కొల్లే సీఈఓ ట్రైనర్ పర్సనాలిటీ డెవలప్మెంట్, సుబ్రహ్మణ్యం గౌడు కౌన్సిలర్, సోమశేఖర్ గౌడ్ టిడిపి గంగవరం అధ్యక్షులు, జయప్ప రామకుప్పం ఎక్స్ జెడ్పిటిసి, రమణ డైరెక్టర్ ఆఫ్ అమెరికన్ ఎక్స్ప్రెస్ యూఎస్ఏ, లలితమ్మ పిఓఆర్డి ఆర్గనైజేషన్ వీరందరూ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ కెరియర్ కౌన్సిలింగ్, జీవన నైపుణ్యాల పర్సనాలిటీ డెవలప్మెంట్ కోర్స్ లు ఉచితంగా మే 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థినీ విద్యార్థులు డిగ్రీ పూర్తి అయిన ఇంగ్లీష్ మాట్లాడడానికి ఈ పినాక ప్రజా సాధికార ట్రస్టు వారు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పినాక ప్రజాసాధికార ట్రస్ట్ 2012 సంవత్సరం నుండి ఇప్పటి వరకూ మదనపల్లె, రాయచోటి,నగిరి, పలమనేరు ప్రాంతాలలో ఉన్న విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు కోసం వారి అభివృద్ధి కోసం తమ పినాక ప్రజా సాధికార ట్రస్ట్ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థులు అభివృద్ధి బాటలో పయనించడానికి వీరు నిరంతరం కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు బాగా చదువుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతి బి. స్వాతి 5000, ఎస్.సబిహా రూ: 2500 ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ తో పాటు మధ్యాహ్న భోజనం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గజేంద్ర,జయశ్రీ, ముద్దుకృష్ణ, చలపతి,రూప్ కుమార్,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరాలి : ప్రధానోపాధ్యాయులు గోపి





**శ్రీకాళహస్తి /పెన్ పవర్ /ప్రతినిధి /జూన్ 8 :** శ్రీకాళహస్తి రూరల్ మండలం ఓబులాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబులాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని గ్రామాలు ఎర్రమరెడ్డిపల్లి రెడ్డిపల్లి ఓబులాయిపల్లి గిరిజన కాలనీలో ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలో లభించే సౌకర్యాలు ఉచితంగా యూనిఫామ్స్ టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్ మధ్యాహ్న భోజనం పథకం తల్లికి వందనం పౌష్టికాహారం కొరకు రాగి జావా చిట్టీలు అందిస్తున్నారని తెలుపుతూ కరపత్రాలు పంచుతూ గ్రామంలోని ఇంటింటికి తిరిగి విద్యార్థులను తల్లిదండ్రులను అవగాహన కలిగించారు వేసవి సెలవులు అనంతరం జూన్ 12వ తేదీ పాఠశాల పున ప్రారంభిస్తున్నందున ముందుగానే విద్యార్థులను బడిలో చేర్చాలని, తల్లిదండ్రులను కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపి ఉపాధ్యాయులు మోహన్ బాబు లోకనాథరెడ్డి శ్రీనివాసులు ప్రగతి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త చంద్రశేఖర్ సిఆర్పి ధన శేఖర్ తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు 16 మంది ప్రైవేటు పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు ప్రవేశాలు కల్పించారు.

## మహిళలను అసభ్యంగా మాట్లాడడం తగదు : బొజ్జల రిషితా రెడ్డి





**శ్రీ కాళహస్తి/ పెన్ పవర్ /ప్రతినిధి /జూన్ 8 :** శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీస్ స్టేషన్ నందు జర్నలిస్ట్ కృష్ణం రాజుపై తెలుగు మహిళలతో కలిసి పిర్యాదు చేసిన బొజ్జల రిషితా రెడ్డి, శ్రీకాళహస్తి చరిత్రలో మొదటిసారి అమరావతి రైతులు, మహిళలకు మద్దత్తుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లిన బొజ్జల ఇంటి బిడ్డ, సనాతన సాంప్రదాయమైన మన భారతదేశంలో స్త్రీలను దేవతలుగా పూజిస్తారని అటువంటి స్త్రీలను ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీ మూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్ళు పై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం సాక్షి న్యూస్ ఛానల్ నందు ప్రముఖ విశ్లేషకుడు కృష్ణంరాజు కించపరిచే విధంగా మాట్లాడడం తగదని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పై చేసిన వాఖ్యల పై తెలుగు మహిళలతో కలిసి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గోపీ కు ఫిర్యాదు చేయడం జరిగింది. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ దేశంలోనే ఏపీ రాజధాని, అమరావతిని ప్రతిష్టాత్మకంగా నిర్మించాలని ఆకాంక్షిస్తూ, మహిళా రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఎన్డీఏ ప్రభుత్వానికి అందచేసారని గుర్తు చేశారు. రాజధానికి భూములు త్యాగం చేసిన మహిళల పట్ల సాక్షి ఛానల్ చర్చ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణంరాజు అసభ్యంగా, అగౌరవంగా అమరావతి ఒక వేశ్యల రాజధాని మాట్లాడడం చాలా బాధాకరమన్నారు. దీనికి వైసీపీ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆమె హెచ్చరించారు. తల్లిని, చెల్లిని అగౌరపరిచేలా అ పార్టీ సోషల్ మీడియాలో, అలాగే పత్రిక మరియు ఛానెల్ నందు విచ్చలవిడిగా తప్పుడు కథనాలు వండి వార్చడం వల్లనే ఆ పార్టీని రాష్ట్రంలోని మహిళలందరూ వైకాపాను 11 సీట్లకే పరిమితం చేసి, బుద్ధి చెప్పారని మండిపడ్డారు. ఇంకా అదే తరహాలో ప్రవర్తిస్తే ఈసారి ఒక సీటు కూడా దక్కదని హెచ్చరించారు. మహిళలతో పెట్టుకుంటే మహిళల సత్తా ఏమిటో త్వరలోనే వైకాపా పార్టీకి, ఆ పార్టీ నాయకులకు చూపిస్తారని రిషిత రెడ్డి హెచ్చరించారు.

## చంద్రప్రభ వాహనంపై వెన్న కృష్ణుడి అలంకారంలో శ్రీగోవిందరాజ స్వామి



**తిరుపతి పెన్ పవర్ జూన్ 8 :** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన ఆదివారం రాత్రి 7.30 గంటలకు గోవిందరాజస్వామివారు చంద్రప్రభ వాహనంపై వెన్న కృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడ వీధుల్లో కోలాహలంగా వాహనసేవ జరిగింది. ఔషధీశుడైన చంద్రుడు మనకు పోషకుడే. రసస్వరూపుడైన చంద్ర భగవానుడు ఔషధులను పోషిస్తున్నాడు. ఆ ఔషధులు లేకపోతే జీవనం లేదు. చంద్రుని వల్ల ఆనందం, చల్లదనం కలుగుతుంది. అందుకే స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఆహ్లాదపరుస్తాడు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఎఫ్ ఏ అండ్ సిఏవో శ్రీ ఓ బాలాజీ, డిప్యూటీ ఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో శ్రీ మునికృష్ణారెడ్డి, అర్చకులు, ఏవీఎస్వో శ్రీ మోహన్ రెడ్డి, పలువురు శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

**జూన్ 09న రథోత్సవం :** శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం రథోత్సవం వైభవంగా జరగనుంది. ఉదయం 6.15 గంటల నుండి రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.



## కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 08 :** ఈనెల 9వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్స్అప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

## ప్రతిభ అవార్డుకు తులసి ఎంపిక

### పదిలో ప్రతిభ చాటిన గిరి పుత్రిక



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ జూన్ 8 :** ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 540 మార్కులు సాధించి ప్రతిభ అవార్డుకు ఎంపికైంది రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా రంగం లో నాణ్యత ప్రతిభను ప్రోత్సహించేందుకు కొత్తగా షైనింగ్ స్టార్స్ అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది పాఠశాల విద్యార్థుల కోసం 500 మార్కులు పైగా మార్పులు సాధిస్తే మండల స్థాయిలో అవార్డు కొరకు ఎంపిక చేస్తారు, పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తులసి అనే విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ సంస్థ సమన్వయకర్తలు చంద్రశేఖర్ శిరీషలు తులసికి అవార్డు రావడం పట్ల అవార్డుకి ఎంపికైన పట్ల అర్ధం వ్యక్తం చేశారు, అభినందనలు తెలిపారు.

## షైనింగ్ స్టార్ అవార్డు పొందిన ధర్మవరం

### - వాసవి జూనియర్ కళాశాల.. డిఐఈఓ సయ్యద్ మౌలా

**ధర్మవరం పెన్ పవర్ జూన్ 8 :** శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రభుత్వం వారు ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులతో ప్రతిపగరపరిచిన వారికి షైనింగ్ స్టార్ అవార్డులను జిల్లాలో 38 మంది విద్యార్థులకు ప్రకటించడం జరిగిందని డిఐఈఓ సయ్యద్ మౌలాతెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందులో భాగంగా ధర్మవరం పట్టణంలోని వాసవి బాలికల జూనియర్ కళాశాలలో నలుగురు విద్యార్థినీలు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఇందులో శాంతియా, ఏ,దివ్య, డి.మౌనిక, ఎస్ నజియా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. వీరందరూ కూడా ఈ నెల 9వ తేదీ సోమవారం కొత్తచెరువులోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపం మైలేపల్లి గ్రామ సమీపము నందు జిల్లా వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కూడా హాజరవుతున్నట్టు వారు తెలిపారు. సైనిక్ స్టార్స్‌కు ఎంపికైన విద్యార్థులను డిఐఈఓ అభినందన శుభాకాంక్షలు కూడా తెలియజేశారు.

## వ్యాపార సముదాయాల ముందు డ్రైన్స్ శిధిలాలను తీసివేయండి

### మురికి కాలువల నందు ఉన్న మట్టిని పూర్తిస్థాయిలో తీసివేయాలి

### పరిటాలశ్రీరామ్ పరిశీలనతో కదిలిన మున్సిపల్ అధికార యంత్రాంగం

### దెబ్బతిన్న మురికి కాలువలను ప్రభుత్వమే నిర్మిస్తుంది మున్సిపల్ కమిషనర్



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 8 :** గత ఐదు రోజుల క్రితం ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ధర్మవరం పట్టణంలో మున్సిపల్ అధికారులు వ్యాపార సముదాయాల ముందు తొలగించిన మురిక కాలువల శిధిలాలను పరిశీలించగా స్థానిక వ్యాపారస్తులు వ్యాపార సముదాయాల ముందు మురికి కాలువలను నిర్మించాలని కోరగా పరిటాల శ్రీరామ్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని హామీ ఇవ్వడం జరిగింది. పరిటాల శ్రీరామ్ సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన మున్సిపల్ కమిషనర్ తెదేపా నాయకులతో కలిసి ఈరోజు కమిషనర్ మున్సిపల్ అధికారులైన డి.ఈ వీరేష్ గారిని, శ్యానిటరీ ఇన్స్పెక్టర్ శామ్సన్,కేశవులను వెంటబెట్టుకుని పట్టణంలో వ్యాపార సముదాయాల ముందు తొలగించిన శిబిరాలను దెబ్బతిన్న డ్రైన్సును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాల ముందు పెద్ద ఎత్తున నిల్వ ఉన్న చెత్తను మురికి కాలువలు బ్లాక్ అయిన వాటిని స్థానిక తెదేపా నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే దెబ్బతిన్న మురికి కాలువలను నిర్మించడంతోపాటు శ్రీదేవి హాల్ వద్ద కల్వర్టును నిర్మించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కమిషన్ గారి దృష్టికి తెదేపా నాయకులు తీసుకువెళ్లారు. తక్షణమే అందుకు సంబంధించిన ఎస్టిమేషన్స్ రెడీ చేయాలని డి.ఈ వీరేష్ గారికి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. పట్టణంలో మూడు రోజుల్లో వ్యాపార సముదాయాల ముందు తొలగించిన చెత్తను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్, తెదేపా నాయకులకు హామీ ఇచ్చారు.

# సిక్స్ లైన్ హైవే పనుల్లో వ్యక్తికి తీవ్ర గాయాలు








**సీతారాంపురం పెన్ పవర్ -జూన్ 8**

సీతారాంపురం లోని పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలో జరుగుతున్న భారత మాల ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో ఆదివారం రాడ్ బెండింగ్ పనులు చేస్తున్న వెస్ట్ బెంగాల్ కు చెందిన రాజు మండేల్ అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం మత్తులో ఉన్న రాజు మండేల్ రాడ్ బెండింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ ఇనుప సువ్వ రాజు కనత భాగంలో గుచ్చుకుంది. ఇనుప రాడ్డు లోతుగా దిగడంతో రక్తస్రావం అధికమవడంతో సహచర కార్మికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## తెలుగు మహిళా ఆధ్వర్యంలో నిరసనలు..!



**మాచర్ల: జూన్ 08 (పెన్ పవర్ న్యూస్)**

ఆంధ్రులకు దైవ సమానమైన అమరావతి రాజధానిని వేశ్యల రాజధాని అని అవమానించడం అంటే కన్నతల్లిని దూషించడమేనని మాచర్ల తెలుగు మహిళ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణ మున్సిపల్ సెంటర్ లో వారు మీడియాతో మాట్లాడుతూ.. జగన్ మీడియా సాక్షి ఛానల్ లో యావత్తు ఆంధ్రప్రదేశ్ మహిళలను, రాజధాని అమరావతిని కించపరిచేలా మాట్లాడిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు లను తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలానే ఆంధ్రప్రదేశ్ లో సాక్షి మీడియా సర్క్యులేషన్ ను, చానెల్ డిస్ట్రిబ్యూషన్ ను తక్షణమే నిలిపివేసి, నిషేధం విధించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సాక్షి ప్రతులను తగలబెట్టి, పట్టణ సీఐ ప్రభాకర్ కు సాక్షి ఛానల్, జర్నలిస్టులు కొమ్మినేని, కృష్ణంరాజులపై ఫిర్యాదు కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ వారికి, సాక్షి మీడియా వారికీ బుద్ధిని ప్రసాదించు దేవుడా- డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు




**పెన్ పవర బ్యూరో బాపట్ల జూన్ 8**

పవిత్ర గంగా జలంతో నాటి ప్రధాని నరేంద్ర మోది చాలా పవిత్రంగా శంకుస్థాపన చేసిన దేవతల రాజధాని ప్రజల రాజధానిగా ఎంచబడుతున్న అమరావతి రాజధాని గురించి, రాజధాని మహిళల గురించిసాక్షి టెలివిజన్ డిబేట్ కార్యక్రమంలో వి వి ఆర్ కృష్ణంరాజు చేసిన అసభ్యకరమైన మాటలు (వేశ్యల రాజధాని అని) క్షమించరానివి. స్త్రీ జాతి ఆత్మగౌరవాన్ని, మొత్తం స్త్రీ సమాజాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడిన కృష్ణంరాజుని దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలని,,అదే విధంగా ఇలాంటి అసభ్యకరమైన విషయాలను పెంచి పోషిస్తున్న సాక్షి టీవీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఈరోజు చందోలు పోలీస్ స్టేషన్ నందు తెలుగు మహిళా అధ్యక్షురాలు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆఫ్జాల్ మరియు పార్టీ సీనియర్ నాయకులు మహిళలతో కలిసి వినతి పత్రం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కి సమర్పించడం జరిగినది.

## అమరావతి మహిళ రైతులను కించపరుస్తూ సాక్షి టీవీ డిబేట్ మాట్లడిన కృష్ణ రాజు పై కర్లపాలెం పోలీస్ స్టేషన్లో పిర్యాదు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 8:**

అమరావతి మహిళలను సాక్షి లైవ్ డిబేట్లో వేశ్యలన్న కృష్ణమరాజు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మహిళలను అవమానిస్తే కూటమి ప్రభుత్వం ఊరుకోదని, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సూచనల మేరకు కర్లపాలెం తెలుగు మహిళా అధ్వర్యంలో కర్లపాలెం పోలిస్ స్టేషన్లో కంప్లైంట్ చేసిన కర్లపాలెం తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళా నాయకులు ఈ కార్యక్రమానికి సంఘీభావంగా కర్లపాలెం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు యేపూరి భూపతి రావు, బాపట్ల పార్లమెంటు తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి, కర్లపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ బాజీ, కర్లపాలెం గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి పిట్ల వసంత రెడ్డి, టిడిపి నాయకులు భేతాళం బాల రామ రాజు, యూనిట్ ఇంఛార్జిలు మద్దిబోయిన బుల్లియ్య, అంగలకుదురు ప్రకాష్ రావు, నాయకులు ఆట్ల బాల శంకర్ రెడ్డి, ముద్దినూరి రామరాజు ఉన్నారు. కంప్లైంట్ చేసిన మహిళ కమిటీలో కర్లపాలెం మండల తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి అంగలకుదురు భవాని, మహిళ నాయకులు ముద్దునూరు సావిత్రి, సాగి ఝాన్సీ,పెనుమెత్స హరిమ్మ, ముద్దునూరు అంకమ్మ తదితరులు పాల్గన్నారు.

## పెడన ఎమ్మెల్యే ఆదేశాలతో పెడన హిందూ స్మశాన వాటికలో పిచ్చి మొక్కల తొలగింపు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, జూన్, 08**

స్థానిక శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ సహకారంతో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు హిందూ స్మశాన వాటిక నందు పిచ్చి మొక్కల నివారణకు అవసరమైన గడ్డి మందు పిచికారి కార్యక్రమం పెడన హిందూ స్మశాన వాటిక నందు ఆదివారం చేపట్టినారు. య.13.57 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న కలుపు మొక్కల నివారణకు జరుగుతున్న పిచికారి కార్యక్రమాన్ని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డువేణుగోపాలరావు, హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటి సభ్యులు కమ్మగంటి వెంకటేశ్వరావు,తమ్మా భీమయ్య,పృథ్వీ వినోద్,యక్కల, బసవా తదితరుల పర్యవేక్షణలో ఉదయం నుండి జరుగుతుంది. ఈ కలుపు మందు పిచికారి ద్వారా పల్లేరు కాయలు, కసింద,తుమ్మా,జిల్లేడు తదితర కలుపు మొక్కలు నివారించబడతాయి అని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపిన నేపథ్యంలో ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టినట్లు హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



# ప్రభుత్వ లాంఛనాలతో అంకినీడు ప్రసాద్ అంత్యక్రియలు

**శివగంగలోని జమిందారుల స్మశాన వాటికలో అంత్యక్రియలు**

**అంతిమయాత్ర, అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, కొనకళ్ళ బుల్లయ్య..**

**పాడె మోసిన కొనకళ్ళ నారాయణ, బుల్లయ్య.**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, జూన్ 08:**

చల్లపల్లి కోట జమిందారు, మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహద్దూర్ వారి కుమారుడు, మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ (86) వారి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ఆదివారం సాయంత్రం జరిగాయి. మచిలీపట్టణం రూరల్ మండలం శివగంగలోని జమిందారుల అతిథి గృహం నుంచి వారి స్వంత స్మశాన వాటికకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంతిమ యాత్ర జరిగింది. అంకినీడు ప్రసాద్ అంతిమ యాత్రలో ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ రావు, టీడీపీ బీసీ నాయకులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య)లు అంకినీడు ప్రసాద్ పాడెను మోశారు. అంకినీడు ప్రసాద్ తనయులు యార్లగడ్డ రామేశ్వర ప్రసాద్, యార్లగడ్డ హరీశ్వర ప్రసాద్ తమ తండ్రికి కన్నీటి వీడుకోలు పలికారు. కొనకళ్ళ కిరణ్ గణపతి, కొనకళ్ళ చైతన్య గణపతి, రాజా కుటుంబ సభ్యులు, పలువురు ప్రజలు అంతిమయాత్ర, అంత్యక్రియలలో పాల్గొన్నారు.

## చైర్మన్ మాలేపాటిని కలిసి అభినందనలు తెలుపుతున్న ప్రజలు





**కావలి పెన్ పవర్ జూన్ 8**

కావలి నియోజకవర్గం మాజీ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ అలాగే రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు భారీ సంఖ్యలో వారి గృహానికి చేరుకొని వారిని శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం చైర్మన్ మాలేపాటి మాట్లాడుతూ, నా మీద అభిమానం తో ప్రజలు రావడం సంతోషంగా ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నా మీద నమ్మకం ఉంచి నాకు ఈ పదవి బాధ్యతలు చేపట్టేందుకు చేపట్టేందుకు అవకాశం కల్పించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిజాయితీ,నిబద్ధత కలిగి తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా తోడుగా అందుబాటులో ఉంటానని వారు తెలిపారు.

# మహిళలను కించపరిస్తే సహించేది లేదు: టీడీపీ నేతలు

## ఎప్పటికీ దేశ రాజధాని అమరావతి

**కారంపూడి : జూన్ 8 ఆదివారం (పెన్ పవర్ న్యూస్)**

దేవతల రాజధాని అయినా అమరావతి ప్రాంత మహిళలను కించపరుస్తూ ఓ ప్రముఖ ఛానల్ లోని డిబేట్ లో మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. కారంపూడి పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో టిడిపి నేతలు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు పై ఆదివారం కారంపూడి ఎస్సై వాసుకు ఫిర్యాదు లేఖను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల. సురేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రమంతా దేవాలయంగా కొలిచే.. అమరావతిపై విష ప్రచారం చేస్తే సహించేది లేదని అన్నారు. అమరావతిపై వైసీపీ పార్టీ విషం చిమ్మే విధంగా గత ఐదు సంవత్సరాలు ప్రచారం చేసిందని అన్నారు. అమరావతి రైతులు రాజధాని కోసం.. కూడు పెట్టే.. భూములను కూడా.. త్యాగం చేసిన వ్యక్తులు అమరావతి ప్రాంతవాసులని ఆయన అన్నారు. అలాంటి అమరావతి రైతులపై మహిళలపై నీచంగా మాట్లాడటం వారికి సిగ్గుచేటు అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఇంత నీచ్యానికి దిగజారుతాడని ఏ రోజు కూడా ఊహించలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డి.. అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి నీ చెప్పు వార్తలు



ప్రచారం చేసే.. ఛానల్ ను బ్యాన్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ గాడిపత్రి రమాదేవి పూర్ణయ్య,చప్పిడి రాము,బొల్లినేడి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు బొమ్మిన శేషగిరిరావు, కారంపూడి సర్పంచ్ సరస్వతి బాలు నాయక్, కటికల బాలకృష్ణ , తండా మస్తానీ, కాటంరెడ్డి నాగలక్ష్మి రెడ్డి, బాల వెంకటేశ్వర్లు తదితరు పాలుగోన్నారు.

# మసుల బీచ్ ఫెస్టివల్‌లో సాంప్రదాయ కళల హోరు






**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,మచిలీపట్నం, జూన్, 08:**

మసుల బీచ్ ఫెస్టివల్ చివరి రోజైన ఆదివారం సాయంత్రం ప్రధాన వేదికపై సాంప్రదాయ కళల హోరులో సముద్రపు అలల హోరులో అశేష జనవాహిని ఓలలాడింది.. కూచిపూడి నృత్యానికి పుట్టినిల్లు కృష్ణాజిల్లా. కాగా జిల్లా ప్రధాన కేంద్రం మచిలీపట్నంలో గత నాలుగు రోజుల నుంచి మసుల బీచ్ ఫెస్టివల్ లో ఎన్నో వినోద విజ్ఞాన కార్యక్రమాలతోపాటు సాంప్రదాయ కళల ప్రదర్శన రీతులతో ప్రేక్షకులను అలరించాయి. అరుణోదయ కళాసమితి విజయవాడ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా “తాండవకరి”, “అలిగిరి నందిత” గేయ నృత్యాలు, సంగీతానికి అనుగుణంగా కూచిపూడి నృత్యంతో కూడిన “కోలాటం” ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిట్టూర్పు నాంచరయ్య బృందం డప్పు ప్రదర్శన, కోలాటం ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

# కొత్త ట్రెండ్ సిస్టర్ ఇన్ స్వెట్.. ఇక్కడ మహిళలు ఏం చేస్తారు.. ఉపయోగం ఏంటీ..?



**హైదరాబాద్ పెన్ పవర్:** వీకెండ్ అంటే.. సినిమాకో, కిట్టీ పార్టీకో లేదంటే.. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి టూర్లకు, ఔటింగ్‌కు వెళ్లడం కామన్. కానీ, సిటీ మహిళలు ఇప్పుడు వీకెండ్‌లో స్పోర్ట్స్ యాక్టివిటీస్?తో ఉత్సాహంగా గడుపుతున్నారు. స్పోర్ట్స్ మీద ఇంట్రస్ట్ చూపిస్తున్నారు కదా.. వీళ్లంతా ప్రొఫెషనల్స్ అనుకుంటే పొరపాటే. ఆరోగ్యం కోసం రొటీన్‌గా జిమ్, యోగా, మెడిటేషన్ క్లాసులకు వెళ్ల కుండా డిఫరెంట్‌గా స్పోర్ట్స్ యాక్టివిటీస్‌లో పార్టిసిపేట్ చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఎప్పుడూ చేసే సాధారణ వ్యాయామానికి బదులు కోర్ స్ట్రెంత్‌తో ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలంటూ బెంగళూరుకు చెందిన 'సిస్టర్ ఇన్ స్వెట్' అనే సంస్థ ఒక కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. దీంతో ఇప్పుడు సిటీలోని చాలామంది మహిళలు ఈ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకుంటున్నారు. 'సిస్టర్ ఇన్ స్వెట్' బెంగళూరు, ముంబై, చెన్నైతో పాటు మన గ్రేటర్ నగరంలో ట్రెండ్ అవుతోంది.

సిస్టర్ ఇన్ స్వెట్ సంస్థ 2017లో బెంగళూరులో తన ప్రస్థానం మొదలుపెట్టింది. ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారిణి తాన్వీ హన్స్, ఫిట్‌నెస్ కోచ్ శ్వేతా సుబ్బయ్య కలిసి ఈ సంస్థను ప్రారంభించారు. మహిళల కోసం, మహిళలతో నడిచే ఈ సంస్థ స్పోర్ట్స్, హెల్దీ ఈవెంట్లతో బెస్ట్ విమెన్ కమ్యూనిటీని డెవలప్ చేస్తోంది. ఈ మధ్యే హైదరాబాద్‌లో కూడా ఆక్టివిటీస్ మొదలుపెట్టింది. మిగతా రోజుల్లో వివిధ పనులతో బిజీగా ఉండే మహిళల ఆరోగ్యంపై ఫోకస్? చేస్తూ వీకెండ్‌లో వాళ్లను స్పోర్ట్స్ యాక్టివిటీస్‌లో భాగస్వాములను చేస్తోంది. జిమ్, యోగాలకు వెళ్లడం ఆసక్తి లేని, ఎనర్జిటిక్ యాక్టివిటీస్ కోరుకునే మహిళల కోసం రకరకాల సెషన్లను అందుబాటులోకి తెచ్చింది. మన నగరంలో ప్రత్యేకంగా కోచ్?ల పర్యవేక్షణలో రన్నింగ్ క్లబ్, ఫుట్ బాల్, పికెల్?బాల్ ?ఆడిస్తోంది. వీటి ద్వారా మహిళలు శారీరకంగా దృఢంగా మారడమే కాకుండా, సోషలైజ్?అయ్యే అవకాశం పెరుగుతుందని చెప్తోంది.

**500 మంది వరకు..**

నగరంలోని కొన్ని ప్లేసెస్‌ను అద్దెకు తీసుకుని స్పోర్ట్స్ యాక్టివిటీస్ నిర్వహిస్తోంది సిస్టర్ ఇన్ స్వెట్. వీకెండ్‌లో సెషన్ల వారీగా ఆటలు, ఫీజులు ఉంటాయి. రూ.300 నుంచి రూ.1000 వరకు ఫీజులు ఉండగా, యాన్యువల్ ?మల్టీ స్పోర్ట్స్ ప్యాకేజీకి రూ. 13,500 వరకు తీసుకుంటున్నారు. వీక్లీ, మంత్లీ సెషన్లు కూడా నిర్వహిస్తున్నారు. రన్నింగ్?ను కేబీఆర్? పార్కులో, పికెల్‌బాల్‌ను జూబ్లీహిల్స్‌లో, ఫుట్ బాల్?ను జూబ్లీహిల్స్‌లోని టర్ఫ్?సైడ్?లో నిర్వహిస్తుండగా.. సుమారు 500 మంది వరకు ఇందులో పాల్గొంటున్నారు. ఈ సంస్థ వెబ్‌సైట్ ంఱరవతీఱఅంఱషమ్‌.ఙశీఎ%లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తర్వాత మెన్షన్? చేసిన టైంకు, చెప్పిన ప్లేస్‌కు వెళ్లి మీట్?అవుతారు. అక్కడ కోచ్? పర్యవేక్షణలో స్పోర్ట్స్ ఆడతారు. ఇప్పుడు నగరంలో మూడు రకాల స్పోర్ట్స్‌యాక్టివిటీస్ నిర్వహిస్తుండగా భవిష్యత్తులో స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటివి చేర్చి ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించనున్నారు.

**త్వరలో 10కే రన్?...**

బెంగళూరులో ఇక్కడున్న వాటితో పాటు అదనంగా స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, వాలీబాల్? వంటి స్పోర్ట్స్? యాక్టివిటీస్ ?అందుబాటులో ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం అక్కడ 2వేల మంది మహిళలతో మారథాన్ ?నిర్వహించి సక్సెస్? అయ్యారు. త్వరలో మన నగరంలోనూ మహిళల కోసం 10కె రన్ నిర్వహించేందుకు సిస్టర్? ఇన్ ?స్వెట్ ?సిద్ధమవుతోంది. మహిళలకు క్రీడల్లో ఉపాధి అవకాశాలను సృష్టించడాన్ని కూడా ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది.–వినోద్? మామిడాల, హైదరాబాద్? సిటీ

**సామాజిక సాధికారతకు వేదిక**

సిస్టర్స్ ఇన్ స్వెట్ కేవలం ఆరోగ్యం మీద అవగాహన కల్పించే సంస్థ మాత్రమే కాదు. మహిళల సామాజిక సాధికారతకు వేదిక కూడా. మా దగ్గర 20 ఏండ్ల వయసు నుంచి 50 ఏండ్లు పైబడిన

వాళ్ల వరకు సుమారు 500 మంది స్పోర్ట్స్?ఆడుతున్నారు. ఇందులో స్టూడెంట్స్, హౌస్? వైఫ్స్, వర్కింగ్? విమెన్, ఆంత్రప్రెన్యూర్స్, టీచర్స్? ఇలా వివిధ రకాల బ్యాక్?గ్రౌండ్ నుంచి వచ్చినవాళ్లు ఉన్నారు. వీళ్లంతా ఈ ఆటల ద్వారా కొత్త ఫ్రెండ్స్?ని పొందుతున్నారు. స్పోర్ట్ ?ఆడటం ఈ బిజీ లైఫ్?లో సోషలైజ్? అవడానికి ఒక మార్గం.

ఇది ఒక హెల్దీ కమ్యూనిటీ డెవలప్ కావడానికి ఉపయోగపడుతుంది. అలాగే, ఎవరైనా ఫిట్?గా ఉంటేనే ఆరోగ్యంగా, ఆనందంగా

ఉండగలరు. ఈ మోడ్రన్ కాలంలో మహిళలు శారీరక దృఢత్వాన్ని పెంచే పనులు అస్సలే చేయడం లేదు. అందుకే వాళ్లలో స్ట్రెంత్‌ను పెంచే ఫిజికల్ యాక్టివిటీస్ చాలా ముఖ్యమని గుర్తించాం. సిస్టర్ ఇన్ స్వెట్ ఆ గ్యాప్ ఫిల్ చేస్తోందని నమ్ముతున్నాం. మహిళల కోసం మహిళలతో నిర్వహిస్తున్న మా సంస్థ మంచి ఎంపవరింగ్, పవర్‌ఫుల్ ప్లాట్?ఫామ్ అవుతుంది.

# రష్యా దాడి చేస్తుందేమోనన్న భయంతో జర్మనీ సన్నాహాలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** యూరప్‌లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో జర్మనీ కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకుని, దేశవ్యాప్తంగా బంకర్లు మరియు ఇతర ఆశ్రయ కేంద్రాల నెట్‌వర్క్‌ను విస్తరించడానికి సన్నాహాలు ప్రారంభించింది. రాబోయే నాలుగేళ్లలో రష్యా మరో యూరోపియన్ దేశంపై దాడి చేయవచ్చనే నిఘా వర్గాల హెచ్చరికలతో జర్మనీ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. గత కొంతకాలంగా జర్మనీలో యుద్ధ సన్నద్ధతపై అంతగా దృష్టి సారించలేదని, అయితే ప్రస్తుత పరిస్థితులు పూర్తిగా మారాయని ఫెడరల్ ఆఫీస్ ఆఫ్ సివిల్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ అసిస్టెన్స్ (బీబీకే) అధిపతి రాల్ఫ్ టైస్లర్ తెలిపారు. "యూరప్‌లో భారీ స్థాయి దురాక్రమణ యుద్ధం జరిగే ప్రమాదం ఉందని మేము ఆందోళన చెందుతున్నాము," అని ఆయన 'సుద్యుయిష్ జైటుంగ్' అనే వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నట్లు 'ది గార్డియన్' ప్రచురించింది. ఉక్రెయిన్‌తో గత మూడేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా, 2029 నాటికి నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సభ్య దేశాన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జర్మనీ రక్షణ దళాల అధిపతి జనరల్ కార్స్టెన్ బ్రూయర్ గత వారం బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో, రష్యా ఏటా వందలాది యుద్ధ ట్యాంకులను తయారు చేస్తోందని, వీటిని 2029 లేదా అంతకంటే ముందే బాల్టిక్ ప్రాంతంలోని నాటో దేశాలపై దాడికి ఉపయోగించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, జర్మనీ కొత్త బంకర్ల నిర్మాణంపై కాకుండా, ఇప్పటికే ఉన్న నిర్మాణాలను షెల్టర్లుగా మార్చడంపై దృష్టి సారించింది. కొత్త నిర్మాణాలు చేపట్టడానికి ఎక్కువ సమయం పట్టడంతో పాటు, ఖర్చు కూడా అధికంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అందువల్ల, పాత సొరంగాలు, మెట్రో స్టేషన్లు, భూగర్భ గ్యారేజీలు, కార్ పార్కులు, ప్రభుత్వ భవనాల నేలమాళిగలు వంటి వాటిని ఆశ్రయ కేంద్రాలుగా మార్చేందుకు బీబీకే ప్రణాళికలు రచిస్తోంది.

"సుమారు 10 లక్షల మందికి తక్షణమే ఆశ్రయం కల్పించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రదేశాలను గుర్తించి, వాటిని మార్చాల్సిన అవసరం ఉంది," అని టైస్లర్ నొక్కి చెప్పారు. దీనికి సంబంధించిన పూర్తి ప్రణాళికను ఈ వేసవి చివరలోగా బీబీకే సమర్పించనుందని 'ది గార్డియన్' నివేదిక పేర్కొంది. సమయంతో పోటీ పడుతున్నామని, కేవలం కొత్త నిర్మాణాలపై ఆధారపడటం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. "అలాంటి షెల్టర్ల ప్రణాళిక, నిర్మాణానికి చాలా సమయం పడుతుంది మరియు చాలా ఖర్చుతో కూడుకున్నది," అని టైస్లర్ వివరించారు.

ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి సుమారు 2,000 బంకర్లు జర్మనీలో ఉన్నప్పటికీ, వాటిలో 600 కన్నా తక్కువ (ఖచ్చితంగా చెప్పాలంటే 580) మాత్రమే ప్రస్తుతం పనిచేసే స్థితిలో ఉన్నాయి. చాలావాటికి భారీ మరమ్మతులు అవసరం. అయినప్పటికీ, ఇవి కేవలం 4,80,000 మందికి మాత్రమే ఆశ్రయం కల్పించగలవు, ఇది జర్మనీ జనాభాలో 1 శాతం కంటే తక్కువ. దీనికి భిన్నంగా, ఫిన్లాండ్‌లో 50,000 రక్షణ గదులు ఉన్నాయని, ఇవి 48 లక్షల మందికి (దేశ జనాభాలో సుమారు 85 శాతం) ఆశ్రయం కల్పించగలవని బీబీకే తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా చర్యలు యూరప్ వ్యాప్తంగా ఇలాంటి రక్షణ చర్యలకు దారితీశాయి. రష్యా మరియు ఉక్రెయిన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న పోలాండ్, ఈ ఏడాది (2025) తన జీడీపీలో దాదాపు 5 శాతాన్ని రక్షణ రంగానికి కేటాయించాలని యోచిస్తోంది. ఇది నాటో దేశాలన్నింటిలోకెల్లా అత్యధికమని గత నెలలో బీబీసీ నివేదించింది. ఈ పరిణామాలు యూరప్ భద్రతా వాతావరణంలో వస్తున్న పెను మార్పులను సూచిస్తున్నాయి.

# ఆధ్యాత్మికం: మృగశిర కార్తె... వర్షాకాలం.. బెల్లం.. ఇంగువ తినండి..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది ( 2025) రోహిణి కార్తె కూల్? కూల్? గా ముగిసింది. రోళ్లు పగిలేలా ఎండలు కాయాల్సిన రోజులు చల్లని వాతావరణంతో రోహిణి కార్తె కంప్లీట్? అయి.. విశ్వావశునామ సంవత్సరంలో మృగశిర కార్తెలోకి జూన్? 8 ఆదివారం ఎంటరయ్యాం. మృగశిర కార్తెకు హిందూ సంప్రదాయం ప్రకారం ఎంతో విశిష్టత ఉందని పండితులు చెబుతున్నారు. పురాణాల ప్రకారం మృగశిర కార్తెకు సంబంధించిన ప్రాముఖ్యత గురించి తెలుసుకుందాం. . .

మృగశిర కార్తెలో వర్షాలు పడతాయి. అంటు వ్యాధులు ప్రబలుతాయి. వాతవరణం చల్లబడటంతో కొన్ని రకాల వ్యాధులు వస్తాయి. అలాంటి వాటినుంచి రక్షణ పొందేందుకు ఇంగువ .. బెల్లం కలిపి తింటే వేడి పెరిగి వర్షాకాలంలో వచ్చే వ్యాధులను నియంత్రిస్తుందని పెద్దలు చెబుతారు.

భారతదేశంలో మృగశిర కార్తెకు విశేష ప్రాధాన్యత ఉందని పురాణాల ద్వారా తెలుస్తోంది. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలతో సతమతమయ్యే జీవకోటికి ... మృగశిర కార్తెలో వచ్చే నైరుతి రుతువపవనాలతో వాతావరణం చల్లబడి ఉపశమనం కలుగుతుంది. మృగశిర కార్తెను రైతులు ఏరువాక సాగే కాలం అని కూడా అంటారు. ఏరువాక అంటే నాగటి చాలు. ఈ కాలంలో రుతుపవనాలు విస్తరించి తొలకరి జల్లులు పడగానే పొలాలు దున్ని పంటలు వేయడం మొదలుపెడతారు.

ఎలా ప్రారంభమవుతుంది..?సూర్యుడు ఒక్కొక్క నక్షత్రం సమీపంలో 14 రోజుల పాటు ఉంటాడు. ఏ నక్షత్రం సమీపంలో ఉంటే.. ఆ కార్తెకు ఆ పేరు పెడతారు... అశ్వినితో ప్రారంభమై రేవతీతో ముగిసే వరకు మొత్తం ఇరవై ఏడు నక్షత్రాల పేర్లతో కార్తెలు ఉన్నాయి. ప్రస్తుతం మృగశిర నక్షత్రానికి చేరువలో సూర్యుడు ఉండటం వల్ల దీనికి మృగశిర కార్తె అనే పేరు వచ్చింది. మృగశిర కార్తె లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మృగశిర , మృగం , మిరుగు , మిర్గం పేర్లతో వ్యవహరిస్తారు. ఈ రోజున ప్రజలు బెల్లంలో ఇంగువను కలుపుకుని సేవిస్తారు. .

పురాణాల్లో ఏముందంటే..!

వైశంపాయనుడు మృగశిర కార్తె రోజునే తన శిష్యుడైన యాజ్ఞవల్క్యునికి తైత్తిరీయోపనిషత్తును బోధించాడని అంటారు. ఈ ఉపనిషత్తు వర్షాధిపతి అయిన వరుణదేవుని ప్రార్ధనతోనే ప్రారంభం అవుతుంది. ఈ కార్తె ప్రాధాన్యత మనకు భగవద్గీతలోనూ కనిపిస్తుంది.. తొలకరి జల్లుల అనంతరం ధరణి నుంచి ఉద్భవించి వ్యాపించే పరిమళాన్ని తానేనని వివరిస్తాడు శ్రీకృష్ణుడు. ఈ సమయంలో వాతావరణ ఆహ్లాదకరంగా ఉండి మానవునిలో ఓజస్సు , తేజస్సు మృగశిర కార్తె అనంతరం అధికం అవుతాయని జీవకుడనే ప్రాచీన వైద్యుడు.. తన గ్రంథాల్లో వివరించాడు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మృగశిర కార్తెలో ఆధ్యాత్మిక చింతనతో గడిపి భగవంతుడి ఆశీర్వాదాలు పొందుదాం..!

# పరిచయం : ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫెయిల్ అయినా.. అబ్దుల్ కలాం పాత్రలో జీవించాడు




**హైదరాబాద్ పెన్ పవర్:** కళ నుంచి కళాకారుడిని ఎవరూ దూరం చేయలేరు. ఒక రంగంలో అడుగుపెట్టాలి అని గట్టి సంకల్పంతో ఉన్నప్పుడు ఏ పరిస్థితులూ తనని ఆపలేవు. తాను కోరుకున్న జీవితం పొందే అవకాశం దొరకడం అరుదుగా జరుగుతుంది. అలాంటప్పుడు అలర్ట్?గా ఉండి వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నవాడు అంచెలంచెలుగా ఎదుగుతాడు. ప్రస్తుతం ఈ యాక్టర్ కూడా అదే బాటలో ఉన్నాడు. అతనే అర్జున్? రాధాకృష్ణన్. మొదట చెప్పినట్టు ముందుగా తను సినిమా రంగంలోకి రావాలని విదేశాల్లో చేస్తున్న జాబ్ ఉన్నఫళంగా మానేశాడు.

కానీ నటనలో ఓనమాలు కూడా తెలియకపోవడంతో యాక్టింగ్ నేర్చుకోవాలి అనుకున్నాడు. అలా సాగుతోన్న జర్నీలో వచ్చిన అవకాశాలన్నీ సద్వినియోగం చేసుకుంటూ మలయాళం, హిందీ, ఇంగ్లీష్ ప్రాజెక్ట్స్‌లో నటిస్తూ బిజీ అయిపోయాడు. ప్రస్తుతం కేరళ క్రైమ్ ఫైల్స్ సీజన్ 2లో పోలీస్ ఆఫీసర్?గా నటించి ప్రశంసలు అందుకుంటున్నాడు అర్జున్. తన జర్నీలోని కొన్ని ఇంట్రెస్టింగ్ విశేషాలు ఇవి. అర్జున్ రాధాకృష్ణన్? తమిళనాడులోని నాగర్‌కోయిల్‌లో పుట్టాడు. కానీ, తను పెరిగిందంతా పుణెలో. తండ్రి సుకుమార రాధాకృష్ణన్, తల్లి లత. అర్జున్‌కి చాలా భాషలు వచ్చు. తల్లి తమిళనాడుకు చెందినవారు కావడంతో తమిళం అబ్బింది. తండ్రిది మలయాళీ ఫ్యామిలీ, అందువల్ల ఈ రెండు భాషలు అనర్గళంగా మాట్లాడతాడు. ఇకపోతే పుట్టి పెరిగిందంతా పుణె, ముంబైల్లో కాబట్టి మరాఠీ, హిందీ నేర్చుకున్నాడు. చివరిగా ఇంగ్లీష్ అది తప్పనిసరి. అర్జున్?కి నటనే కాదు.. ఫొటోగ్రఫీ కూడా చాలా ఇష్టం.

**జాబ్ మానేసి..**

అర్జున్, పుణెలోని సెయింట్ మేరీస్ స్కూల్లో చదివాడు. తర్వాత ఇంజినీరింగ్‌లో ఫెయిల్ కావడంతో కొన్నాళ్లు కాల్ సెంటర్‌లో జాబ్ చేశాడు. ఆ తర్వాత ఫెర్గ్యూసన్ కాలేజీలో చేరి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. 2009లో మల్టీ నేషనల్ కంపెనీలో కన్సల్టెంట్‌గా వర్క్ చేశాడు. అయితే అర్జున్?కి చిన్నప్పటి నుంచి సినిమాలంటే విపరీతమైన ఇష్టం. అమితాబ్? బచ్చన్, కమల్ హాసన్, మమ్ముట్టి తన ఫేవరెట్ యాక్టర్స్? అని చెప్తుంటాడు. సినిమాల మీద ఉన్న ఆసక్తి తనని జాబ్?లో నిలకడగా ఉండనివ్వలేదు. దాంతో 2012లో యాక్టింగ్ నేర్చుకోవడం కోసం జాబ్ కూడా మానేశాడు. ఆ తర్వాత ఏమ యిందంటే.. యాక్టింగ్ నేర్చుకోవాలి అనుకున్నాడు.అయితే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలంటే ఎంట్రన్స్ ఎగ్జామ్ ఉంటుంది.

అది పాస్ అయితేనే సీటు దొరుకుతుంది. దీంతో పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఎంట్రన్స్ ఎగ్జామ్ రాశాడు. కానీ ఆ పరీక్షలో తాను పాస్ కాలేదు. మళ్లీ పరీక్ష రాశాడు. ఈసారి కూడా ఎగ్జామ్ ఫెయిల్ అయ్యాడు. ఆ నిరాశలో ఉన్నప్పుడు ఆ ఇన్‌స్టిట్యూట్‌లోని స్టాఫ్‌లో ఒకరు ఎగ్జామ్ ఫెయిల్ అయినా, అతనులో నటించే సత్తా ఉందని గుర్తించారు. ఆ విషయం కాస్ట్యూమ్ డైరెక్టర్ చెవిన పడడంతో ఆడిషన్‌కి రమ్మని పిలుపొచ్చింది. అలా వచ్చిన అవకాశం తనని మళ్లీ వెనుదిరగనివ్వలేదు. రెండుసార్లు ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫెయిల్ అయిన అదే ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్నో సినిమాలకు అర్జున్ పనిచేశాడు. ఈ క్రమంలో నటించడానికి ముందు ఐలాండ్, రిప్పుల్స్, ఆర్ఫన్స్ వంటి థియేట్రికల్ ప్రొడక్షన్స్‌లో ఎన్నోసార్లు పాలుపంచుకున్నాడు.

**అబ్దుల్ కలాం పాత్రలో**

ఇటు మలయాళంలో వచ్చే ఆఫర్లు అందుకుంటూ అటు హిందీలోనూ తన కెరీర్ కొనసాగించాడు. 2023లో 'రాకెట్ బాయ్స్' సిరీస్‌లో అబ్దుల్ కలాం పాత్రలో నటించాడు. ఆ సిరీస్ తనకు ఎనలేని గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా అర్జున్, అబ్దుల్ కలాంను గుర్తుచేసుకున్నాడు. "ఆయన ప్రెసిడెంట్‌గా ఉన్న టైంలో తను చదివిన ఫెర్గ్యూసన్ కాలేజీ విజిట్‌కి వచ్చారు. అప్పుడు స్టూడెంట్‌గా గుంపులో ఒకడిగా నిలబడి ఆయన్ను చూసి ఆనందించాను. అలాంటిది ఆయన పాత్రలో నేను నటించడం అనేది ఊహకు కూడా అందని విషయం. అది నిజమైనందుకు అలాంటి గొప్ప అవకాశం నాకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది"అని చెప్పుకొచ్చాడు.

కెరీర్ మొదలైంది

2017లో 'శ్రీలాన్సర్'? సినిమా ద్వారా డెబ్యూగా చేశాడు. ఇది హిందీ, ఇంగ్లీష్? భాషల్లో ఉంటుంది. అదే ఏట 'షట్? అప్' అనే షార్ట్? ఫిల్మ్?లోనూ కనిపించాడు. ఆ తర్వాత రూప్?కి రాణి, తు, డాన్ సాంగ్?, క్యాట్?డాగ్ వంటి షార్ట్ ఫిల్మ్స్?లో నటించాడు. 2018లో 'మెగాలోపోలీస్' అనే హిందీ సినిమాలో ఆడమ్? అనే పాత్రలో నటించాడు. 2022లో తనకు ఇష్టమైన నటుడు అమితాబ్? బచ్చన్? నటించిన 'ఝుండ్'? అనే సినిమాలో 'అర్జున్' అనే పాత్ర పోషించాడు. అదే సంవత్సరం మలయాళం సినిమాలో ఆఫర్ రావడంతో అక్కడ తన లక్?ని టెస్ట్ చేసుకున్నాడు. మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటించిన 'డియర్ ఫ్రెండ్'లో శ్యామ్ పాత్రలో కనిపించాడు. అంతలోనే టైటిల్ రోల్ చేసేందుకు మరొక అవకాశం తలుపుతట్టింది. దీంతో భాషాభేదం లేకుండా కొత్త హీరోగా తనను తాను 'పడ' సినిమాతో హీరోగా మలయాళం ప్రేక్షకులకు పరిచయం చేసుకున్నాడు. 'పడ' సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్ర కోసం అసిస్టెంట్ డైరెక్టర్ ఫోన్ చేశాడు. ఆ సినిమా ఆడిషన్ కోసం వెళ్తే అక్కడ నేను మాట్లాడే మలయాళం యాస చూసి నన్ను సెలక్ట్ చేశాడు. ఎందుకంటే ఆయన ఊహించినదానికంటే

నేను కాస్త బెటర్?గా మలయాళం మాట్లాడానట. ఆ తర్వాత ఈ సినిమా ఓకే అవ్వడంతో నాతోపాటు మా ఫ్యామిలీ కూడా చాలా ఎగ్జైట్ అయింది. మలయాళంలో ఒక ఫుల్ లెంగ్త్ ఉన్న పాత్ర చేస్తున్నందుకు హ్యాపీగా ఫీలయ్యారు. ఈ కథ చెప్పేటప్పుడు నేను వాస్తవ సంఘటనలను ఆధారం చేసుకుని రాసుకున్నారు అనుకున్నాను. కానీ, షూటింగ్?కి కేరళ వచ్చిన తర్వాతే తెలిసింది ఎంతో మంది మలయాళీలు దీనిని ఎదుర్కొన్నారు. ఇందులోని పాత్ర కూడా రియల్ క్యారెక్టరే అని తెలుసుకున్నా. అన్నింటికీ మించి నేను మలయాళం సినిమాలో నటించడానికి పదేళ్లకు పైగా వెయిట్ చేస్తున్నా. అలాంటి టైంలో మలయాళం నుంచి ఆఫర్ రావడంతోనే నేను ఇది చేస్తాను అని ఫిక్స్? అయిపోయా. ఇంకా ఎన్నో సినిమాలు మలయాళంలో చేయాలనుంది. ఇంతకుముందే డియర్ ఫ్రెండ్?లో నటించడంతో నాకు అవుట్ సైడర్?ని అనే ఫీలింగ్? పోయింది. ఇప్పుడు కంఫర్టబుల్?గా సినిమాలు చేయగలుగుతున్నా.

# 2026 టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు కూర్పుపై ఉత్కంఠ.. సూర్య కెప్టెన్సీలో యువతకు పెద్దపీట?

- వచ్చే ఏడాది భారత్, శ్రీలంక ఆతిథ్యంలో టీ20 ప్రపంచకప్
- సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యం
- గిల్, జైస్వాల్ తిరిగి జట్టులోకి... అభిషేక్ శర్మ నిలకడైన ప్రదర్శన
- మిడిలార్డర్‌లో తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్‌లకు చోటు ఖాయం
- సంజూ శాంసన్ ప్రధాన వికెట్ కీపర్... రెండో స్లాట్ కోసం పోటీ
- పాండ్యా, అక్షర్, కుల్దీప్, వరుణ్ ఎంపిక లాంఛనమే
- బుమ్రా, అర్ష్‌దీప్‌తో పాటు మూడో పేసర్‌గా హర్షిత్ రాణాకు అవకాశం







వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్‌నకు ఇప్పటినుంచే రంగం సిద్ధమవుతోంది. 2024 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో, కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో భారత జట్టు అద్భుత విజయాలతో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఆడిన 15 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో 2026 మెగా టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవడమే లక్ష్యంగా టీమిండియా వ్యూహరచన చేస్తోంది. 2025 ఐపీఎల్ ప్రదర్శన, కొందరు ఆటగాళ్లకు జాతీయ జట్టులోకి రావడానికి చివరి అవకాశంగా నిలిచింది.

**ఓపెనర్లుగా గిల్, జైస్వాల్... ఆకట్టుకుంటున్న అభిషేక్**

గత ఏడాది టెస్ట్ క్రికెట్, ఆ తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీపై దృష్టి సారించడం వల్ల పొట్టి ఫార్మాట్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఐపీఎల్‌లో వీరిద్దరూ బ్యాటింగ్‌లో అదరగొట్టారు. ఇటీవలే భారత టెస్ట్ జట్టు కెప్టెన్‌గా నియమితుడైన గిల్.. శ్రీలంకతో జరిగిన చివరి టీ20 సిరీస్‌లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. దీంతో, సూర్యకుమార్‌కు డిప్యూటీగా గిల్‌ను ఎంపిక చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మరోవైపు, భారత జట్టులోకి అరంగేట్రం చేసినప్పటి నుంచి అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న అభిషేక్ శర్మ, ఇంగ్లండ్‌తో జరిగిన గత టీ20 మ్యాచ్‌లో కేవలం 37 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. అతని లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్ కూడా జట్టుకు అదనపు బలం చేకూర్చనుంది.

**మిడిలార్డర్‌లో తిలక్, శ్రేయస్ స్థానాలు పదిలం**

మిడిలార్డర్ విషయానికొస్తే దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో క్లిష్టమైన పరిస్థితుల్లో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. ఇక, డిసెంబర్ 2023 తర్వాత భారత జట్టు తరఫున టీ20 మ్యాచ్ ఆడకపోయినప్పటికీ, 2025 ఐపీఎల్‌లో 604 పరుగులు చేసి శ్రేయస్ అయ్యర్ సత్తా చాటాడు. అంతేకాకుండా, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో టీమిండియా తరఫున టాప్ స్కోరర్‌గా నిలవడం అతన్ని విస్మరించలేని శక్తిగా మార్చింది. శ్రేయస్ నాయకత్వ పటిమ కూడా జట్టుకు ఉపయోగపడే అవకాశం ఉంది.

**వికెట్ కీపర్‌గా సంజూ... రెండో స్థానానికి పోటీ**

వికెట్ కీపర్ బ్యాటర్ల విషయానికొస్తే.. 2024లో మూడు సెంచరీలు సాధించిన సంజూ శాంసన్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. అయితే, రిషభ్ పంత్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో రెండో వికెట్ కీపర్ స్థానం కోసం పోటీ నెలకొంది. టాప్ ఆర్డర్‌లో ఇప్పటికే చాలా మంది ఆటగాళ్లు ఉండటంతో, లోయర్ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగల ఆటగాడి కోసం జట్టు యాజమాన్యం చూస్తోంది. ఈ క్రమంలో కేఎల్ రాహుల్‌కు జట్టులో చోటు కష్టంగా మారింది. దీంతో, జితేశ్ శర్మ, ధ్రువ్ జురెల్ మధ్యే రెండో వికెట్ కీపర్ స్థానానికి ప్రధాన పోటీ నెలకొంది. 2025 ఐపీఎల్‌లో ఆర్‌సీబీ విజయంలో కీలక పాత్ర పోషించిన జితేశ్ శర్మకే ఎక్కువ అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఆల్‌రౌండర్లు, స్పిన్నర్లు వీరే**

ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌ల ఎంపిక లాంఛనప్రాయమే. వీరిద్దరూ భారత జట్టులో అత్యంత కీలకమైన ఆటగాళ్లు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే, స్టార్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి కూడా జట్టులో స్థానం సంపాదించుకోవడం ఖాయం.

**ఎస్ దళం... మూడో పేసర్‌గా హర్షిత్?**

2024 టీ20 ప్రపంచకప్ విజయంలో భారత పేస్ దళానికి నాయకత్వం వహించిన జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ 2026లోనూ టైటిల్ నిలబెట్టుకోవడంలో కీలక పాత్ర పోషించనున్నారు. వీరిద్దరితో పాటు మూడో పేసర్ స్థానం కోసం హర్షిత్ రాణా ముందున్నాడు. బంతిని బలంగా నేలకు కొట్టే ప్రత్యేక నైపుణ్యం (హిట్ ది డెక్ బౌలర్)తో పాటు, బ్యాటింగ్ కూడా చేయగల సామర్థ్యం హర్షిత్‌కు అదనపు బలం. అతనిపై జట్టు యాజమాన్యానికి పూర్తి నమ్మకం ఉందని తెలుస్తోంది. ఒకవేళ, ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో మాదిరిగా ఒకే ఒక స్పెషలిస్ట్ పేసర్‌తో బరిలోకి దిగాలని జట్టు భావిస్తే, ఆల్‌రౌండ్ ఆప్షన్లను పెంచుకోవడానికి నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, లేదా శివమ్ దూబేలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. ఈ మెగా టోర్నీకి ముందు (ఆసియా కప్ జరగకపోతే) భారత జట్టు కనీసం 18 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. కాబట్టి, కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లకు వివిధ కాంబినేషన్లను ప్రయత్నించి, సరైన జట్టును ఎంపిక చేయడానికి తగినంత సమయం ఉంది.

# యూకే చేరుకున్న టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ఇండియా సీనియర్ టీమ్ శనివారం లండన్‌కు చేరుకుంది. 2025%–%27 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్‌లో భాగంగా ఈ సిరీస్ జరగనుంది. స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని యంగ్ ఇండియా ఈ సిరీస్‌లో బరిలోకి దిగనుంది. ఇంగ్లండ్%–%ఎ జట్టుతో పాటు కొంత మంది టెస్ట్ టీమ్‌కు ఎంపికైన ప్లేయర్లు ఇప్పటికే ఇంగ్లండ్‌లో ఆడుతున్నారు. 'ఇండియా క్రికెట్ జట్టులో, ముఖ్యంగా ఈ టెస్ట్ సిరీస్‌లో భాగం కావడం చాలా బాగుంది. యూకేకు స్వాగతం' అని సాయి సుదర్శన్ బీసీసీఐ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియోలో వ్యాఖ్యానించాడు. జూన్ 20 నుంచి లీడ్స్‌లో తొలి టెస్ట్, తర్వాతి మ్యాచ్‌లు బర్మింగ్‌హామ్ (జూలై 2%–%6), లార్డ్స్ (జూలై 10%–%14), మాంచెస్టర్ (జూలై 23%–%27), ఓవల్ (ఆగస్టు 4%–%8)లలో జరుగుతాయి.



**షష్టిపూర్తిలో ఆకాంక్ష సింగ్ క్లాసిక్‌గా కనిపిస్తుంది**

# వార్-2.. నిర్మాతలు పెద్ద యుద్ధమే చేయాలేమో?



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ ప్రముఖ నటుడు హృతిక్ రోషన్ కాంబినేషన్ లో వార్-2 మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే తారక్ బాలీవుడ్ లోకి ఎంట్రీ (డైరెక్ట్ హిందీ మూవీ) ఇస్తున్నారు. స్పై జోనర్ లో స్టార్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. యష్ రాజ్ ఫిల్మ్స్ భారీగా నిర్మిస్తోంది.బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్న వార్-2ను ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బిజినెస్ కు సంబంధించిన వ్యవహారాలు పూర్తి చేస్తున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.అయితే తెలుగులో కూడా వార్-2 రిలీజ్ కానుండగా.. ఇప్పటికే థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌసెస్ పోటీ పడినట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. కానీ వారెవరికీ హక్కులు ఇవ్వమని యష్ రాజ్ ఫిల్మ్స్ చెప్పిందని టాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా సినిమాను సొంతంగా రిలీజ్ చేయాలని నిర్ణయించుకుందని సమాచారం.అదే సమయంలో తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ వాల్యూ రూ.90 కోట్ల వరకు ఉంటుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు వాటిని తిరిగి పొందాలంటే.. వార్-2 మేకర్స్.. పెద్ద యుద్ధమే చేయాలేమోనని అంటున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ సేఫ్ జోన్ ఉండే ఛాన్స్ ఉన్నా.. రిస్క్ చేస్తుందని అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా స్పై జోనర్ కు తెలుగులో మరింత అంత ఫ్యాన్ బేస్ ఉండదు. అందుకే జోనర్ తోనే ఫస్ట్ సమస్య. ఆ తర్వాత ఎన్టీఆర్ సోలో మూవీ అయితే.. తెలుగులో భారీ వసూళ్లు రాబట్టడం ఈజీనే. కానీ సినిమా కంటెంట్ అంతా బాలీవుడ్ ఫ్లేవర్ లో ఉన్నట్టు క్లియర్ గా తెలుస్తోంది. కాబట్టి తారక్ ప్రమోషన్స్ చేసినా అది సరిపోదు.అదే సమయంలో వార్-2 రిలీజ్ రోజు కూలీ మూవీ విడుదల కానుంది. రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబోలో రానున్న ఆ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషన్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. సినిమాలో అన్ని ఇండస్ట్రీల నటులున్నారు. దీంతో వార్-2 కన్నా కూలీకే ఎక్కువ బ్రాండ్ వాల్యూ ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు వార్-2.. తెలుగులో ఎలా గట్టెక్కుతుందో వేచి చూడాలి.



**అలియా భట్ ప్రతిభకు చక్కదనం కలిసొచ్చింది**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com